ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 52 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 29 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :52 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 29 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





# ఏపీని వణికిస్తున్న మొంథా తుపాను..

## అరకు ఘాట్‌లో వరద బీభత్సం, ప్రకాశం జిల్లాలో కొట్టుకుపోయిన కారు

- మొంథా తుపాను ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- అల్లూరి జిల్లాలో అరకు ఘాట్ రోడ్డుపై ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద
- సుంకరమెట్ట వద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ప్రకాశం జిల్లాలో ఉప్పొంగిన వాగులో కొట్టుకుపోయిన కారు
- డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో తప్పిన ప్రాణనష్టం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**కాకినాడ-మచిలీపట్నం మధ్య మొంథా తుపాను తీరం దాటే ప్రక్రియ మొదలైంది. తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. కుండపోత వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో జనజీవనం స్తంభించిపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు ఘాట్ రోడ్డుపై వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండగా, ప్రకాశం జిల్లాలో ఓ కారు వాగులో కొట్టుకుపోయింది.

**అరకు ఘాట్‌పై నిలిచిన రాకపోకలు**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతం తడిసి ముద్దయింది. వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో అరకు వ్యాలీ-విశాఖపట్నం మధ్య ఘాట్ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా సుంకరమెట్ట కాఫీ తోటలు, అనంతగిరి మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాణాలను పణంగా పెట్టి కొందరు వాహనదారులు రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారులు అప్రమత్తమై, అనవసర ప్రయాణాలు మానుకోవాలని ప్రజలకు సూచనలు జారీ చేశారు.

**ప్రకాశం జిల్లాలో వాగులో కొట్టుకుపోయిన కారు**

ఇదిలా ఉండగా, ప్రకాశం జిల్లాలోనూ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఒంగోలు సమీపంలోని యరజర్ల-వెంగముక్కలపాలెం మధ్య ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఓ కారు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. అకస్మాత్తుగా పెరిగిన వరద తీవ్రతకు కారు అదుపుతప్పి వాగులోకి జారిపోయింది. అయితే, డ్రైవర్ అప్రమత్తమై వెంటనే కారులో నుంచి బయటకు రావడంతో ప్రాణనష్టం

తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. రానున్న గంటల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది.

## తరుముకొస్తున్న 'మొంథా' తీవ్ర తుపాను..

### పవన్ కల్యాణ్ తో కలిసి సీఎం చంద్రబాబు సమీక్ష



- ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణకు అధికారులకు ఆదేశాలు
- అర్ధరాత్రి కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటే అవకాశం
- డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచన
- ఇప్పటికే 43 వేల హెక్టార్లలో పంట నీట మునిగినట్లు అంచనా
- రహదారులకు అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:**బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను కోస్తాంధ్ర తీరంవైపు దూసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. తుపాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులను, అధికారులను

వివరాలు 2లో..

## ప్రజా వ్యతిరేక పాలకులు ఈసారి ఇంటికే



- డీఎంకే ప్రభుత్వంపై నటుడు, టీవీకే అధినేత విజయ్ తీవ్ర విమర్శలు
- కావేరి డెల్టా రైతుల విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో పంటలు నీటిపాలయ్యాయని ధ్వజం
- మొలకెత్తిన ధాన్యంతో ప్రభుత్వ వ్యతిరేకతను పోల్చిన విజయ్
- రైతులను ఆదుకోవడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏటా ఇదే దుస్థితి పునరావృతమవుతోందని ఫైర్

వివరాలు 2లో..

## మావోయిస్టు పార్టీలో.. అంతర్గత చీలికలు



**పెన్ పవర్ డెస్క్:** తాము పోలీసులకు లొంగిపోలేదని, తమ సిద్ధాంతాన్ని ఓడించడం ఎవరి తరమూ కాదని మావోయిస్టు పార్టీ అగ్రనేత చంద్రన్న అభియాన్ ప్రసాదరావు అన్నారు. డీజీపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. తాము ప్రజల మధ్య ఉండి ప్రజల కోసం పనిచేస్తామని వెల్లడించా రు. మావోయిస్టు పార్టీలో అంతర్గత బిలికలు వచ్చా యని చెప్పారు. తమది లొంగుబాటు కాదని, అభి వృద్ధిలో కలిసి పనిచేసేందుకు నిర్ణయం తీసుకొనే వచ్చామని చెప్పారు. ఇప్పటి వరకు ఉద్యమంలో

వివరాలు 2లో..

## టెట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేస్తాం

- సచివాలయంలో మంత్రి లోకేశ్ ను కలిసిన టీడీపీ ఎమ్మెల్సీలు
- సుప్రీం తీర్పుపై ఉపాధ్యాయుల ఆవేదనను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన నేతలు
- 2010కు ముందు నియమితులైన టీచర్లపై తీర్పు ప్రభావం
- సుప్రీం ఉత్తర్వుల మేరకు ఇప్పటికే టెట్ నోటిఫికేషన్ జారీ
- టెట్ నిర్వహిస్తూనే, ఉపాధ్యాయుల కోసం న్యాయపోరాటం చేస్తామన్న మంత్రి

వివరాలు 2లో..



## ట్రంప్ కు పుతిన్ షాక్.. ప్లుటోనియం ఒప్పందం రద్దు

- 2016 లో ఒబామా హయాంలోనే ఈ ఒప్పందం నిలిపివేసిన పుతిన్
- తాజాగా ఈ ఒప్పందాన్ని శాశ్వతంగా రద్దు చేస్తూ సంతకం
- ఉక్రెయిన్ తో యుద్ధం విషయంలో పుతిన్ పై ట్రంప్ ఆగ్రహం

వివరాలు 2లో..



## భీకర తుఫాన్ గా మొంథా

- మొంథా తుఫాన్ ఎఫెక్ట్: కాకినాడకు గ్రేట్ డేంజర్ సిగ్నల్
- కాకినాడ పోర్టులో 10వ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ
- విశాఖ, గంగవరం, భీమునిపట్నం, కళింగపట్నంలో 9వ డేంజర్ సిగ్నల్ జారీ
- మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవులకు 8వ నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ



**పెన్ పవర్ డెస్క్:**తుఫాన్ మొంథా భీకరంగా మారింది. తీవ్ర తుఫాన్ గా తీరం దాటనుంది. భయంకరమైన గాలులు తీరాన్ని అల్లకల్లోలం చేయనున్నాయి. తీవ్ర తుఫాన్ గా మొంథా తీరం దాటనున్నట్లు.. 2025, అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ప్రకటించింది భారత వాతావరణ శాఖ. భీకర తుఫాన్ మొంథా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మచిలీపట్నం.. కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటనున్నట్లు ప్రకటించింది. తీరం దాటే సమయంలో 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతోపాటు అతి భారీ వర్షాలు పడనున్నట్లు వెల్లడించింది.

**హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో ఈ జిల్లాల్లో వర్షాలు..**

మొంథా తుఫాన్ ఎఫెక్ట్ తో ఆంధ్రప్రదేశ్ తో పాటు ఇటు తెలంగాణలోని పలుజిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని

వివరాలు 2లో..



## మొంథా తుపాను... కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ఆదేశాలు

- దక్షిణ మధ్య, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలతో అశ్వినీ వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్
- తెలుగు రాష్ట్రాలు, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌ల ఏర్పాటుకు ఆదేశం
- విజయవాడ, విశాఖ, గుంటూరు డివిజన్లలో సిబ్బందిని సిద్ధం చేయాలని సూచన

వివరాలు 2లో..

## తుపాను బాధితులకు సాయం చేయండి

### కాంగ్రెస్ శ్రేణులకు షర్మిల దిశానిర్దేశం

- మొంథా తుపానుపై షర్మిల స్పందన
- సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు
- రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా నిలవాలని సూచన




**పెన్ పవర్ డెస్క్:** మొంథా తుఫాను సృష్టిస్తున్న విపత్కర పరిస్థితుల్లో ప్రభావిత ప్రాంత ప్రజలకు అండగా నిలవాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్

వివరాలు 2లో..

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- 8వ కేంద్ర వేతన సంఘం విధివిధానాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల పెంపుపై సిఫార్సులు
- నియామకం జరిగిన 18 నెలల్లోగా కమిషన్ నివేదిక సమర్పణ
- దేశ ఆర్థిక పరిస్థితి, రాష్ట్రాలపై ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోనున్న సంఘం
- సుమారు 50 లక్షల ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం
- 2026 జనవరి 1 నుంచి సిఫార్సులు అమల్లోకి వచ్చే అవకాశం

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

## చంద్రబాబు పార్టీ అంశాలపై దృష్టి
# వార్నింగా... యాక్షనా...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనను ముగించుకుని అమరావతికి చేరుకున్నారు. కృషా? జిల్లాలో నేతల మధ్య విభేదాలపై చంద్రబాబు ఫోకస్ పెట్టే అవకాశముంది. ప్రధానంగా తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదం రోడ్డున పడింది. ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడంతో పార్టీని బాగా డ్యామేజీ చేసింది. విదేశాల్లో ఉన్నప్పుడే చంద్రబాబు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి ఎవరినీ పిలిపించి మాట్లాడవద్దని, తాను వచ్చిన తర్వాత ఇద్దరి విషయంలో చర్యలు తీసుకుంటానని చెప్పారు. దీంతో చంద్రబాబు రాకతో ఎవరిపై చర్య చంద్రబాబు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. చంద్రబాబు స్టయిల్ ఆఫ్ యాక్షన్స్ దగ్గర నుంచి చూసిన వారికి ఎవరికైనా .. ఎవరిపైనా చర్యలు ఉండే అవకాశాలు ఉండవన్నది ఒక వాదన. ఆయన పార్టీ అధినేతగా ఇప్పటి వరకూ పార్టీ నుంచి సస్పెన్షన్ చేసిన నేతలు చాలా తక్కువ. పార్టీలు మారినప్పుడే వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు తప్పించి, ఇలాంటి వివాదాల విషయంలో ఆయన నేరుగా యాక్షన్ కు దిగే అవకాశం లేదన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ వేటు వేయడానికి లైంగిక వేదింపులే కారణం తప్ప పార్టీ విషయంలో రచ్చ కెక్కడం మాత్రం కాదు. ఇప్పుడు తిరువూరు విషయంలోనూ ఇద్దరు నేతలకు హెచ్చరికలతో సరిపెడతారన్నది ఎక్కువ మంది నేతల అభిప్రాయంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఇద్దరు నేతలు.. సామాజికవర్గం పరంగా చూస్తే గట్టి వారే. ఇటు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దళిత వర్గానికి చెందినవారు. ఆయనపై చర్య తీసుకుంటే అది తప్పుడు సంకేతాలు వెళతాయని చంద్రబాబు భావించే అవకాశాలున్నాయి. ఇప్పటికే పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్న కొలికపూడి శ్రీనివాసరావును హెచ్చరించి పంపారు తప్పించి చర్యలకు దిగకపోవడాన్ని కొందరు ఈ సందరరేగా గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కూడా యాక్షన్ ఇలాగే ఉంటుందని అంటున్నారు. ఇక విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కృషా? జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందిన వారు కావడం, అందులోనూ ఆయన ఎంపీగా ఉండటంతో ఆయనకు కూడా హెచ్చరికలతో సరిపెడతారంటున్నారు. చంద్రబాబు కేవలం ప్రకటనల్లో మాత్రమే సస్పెన్షన్ అంటూ హెచ్చరిస్తారని, చేతలకు వచ్చేసరికి కమిటీ వేసి ఆ వివాదం సమసిపోయేలా చేయడంలో దిట్ట అని సీనియర్ నేతలే అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు దృష్టి పెట్టి తిరువూరు సమస్యకు చెక్ పెట్టే అవకాశాలున్నాయి. అంతే తప్ప యాక్షన్ కు దిగే అవకాశాలు మాత్రం లేవన్నది వాస్తవం.

## టెట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేస్తాం

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ తీర్పుతో ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

మంగళవారం నాడు సచివాలయంలో మంత్రి లోకేశ్ ను టీడీపీ ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ కలిశారు. 2010 అక్టోబర్ 23కు ముందు డీఎస్సీల ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సుప్రీంకోర్టు తీర్పుతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వారి తరఫున ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని వారు మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, 2025 సెప్టెంబర్ 1 నాటికి ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీస్ ఉన్న ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఈ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 24న టెట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. 20 నుంచి 25 ఏళ్లుగా సర్వీసులో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు సైతం ఇప్పుడు టెట్ పాస్ కాకపోతే అనర్హులుగా మారే ప్రమాదం ఉందని, ఇది వారిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని ఎమ్మెల్సీలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, ఐదేళ్ల లోపు సర్వీస్ ఉన్నవారు ప్రమోషన్లు పొందాలన్నా టెట్ తప్పనిసరి అని పేర్కొన్న విషయాన్ని కూడా వారు వివరించారు. ఎమ్మెల్సీలు చెప్పిన విషయాలపై స్పందించిన మంత్రి లోకేశ్, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం టెట్ నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో, ఉపాధ్యాయుల ఆకాంక్షలు, వారి సర్వీసును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో కచ్చితంగా రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

## ట్రంప్ కు పుతిన్ షాక్.. ఫ్లుటోనియం ఒప్పందం రద్దు

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ గట్టి షాకిచ్చారు. ఉక్రెయిన్ తో యుద్ధాన్ని ఆపేయాలన్న తన సూచనను పెడచెవిన పెట్టాడని పుతిన్ పై ట్రంప్ ఇప్పటికే ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలోనే అమెరికాతో గతంలో రష్యా కుదుర్చుకున్న ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారు. దీనికి సంబంధించిన చట్టంపై తాజాగా పుతిన్ సంతకం చేశారు. ఈ పరిణామం మళ్లీ అణు ఉద్రిక్తతలకు దారితీస్తుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

**ఒబామా హయాంలోనే..**

2000 సంవత్సరంలో అమెరికా, రష్యాల మధ్య ఫ్లుటోనియం నిర్వహణపై ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2010లో ఈ ఒప్పందాన్ని సవరించారు. దీని ప్రకారం.. రష్యా తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ఫ్లుటోనియంను అణ్వాయుధాల తయారీకి వాడకూడదు. ఈ నిల్వలను పౌర అణు విద్యుత్ తయారీ కోసం వినియోగించుకోవాలని ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారీని అడ్డుకున్నట్లు అప్పట్లో అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒబామా హయాంలో 2016 సంవత్సరం అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీంతో ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు.

## మొంథా తుపాను... కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ఆదేశాలు

'మొంథా' తీవ్ర తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో భారత రైల్వే శాఖ అప్రమత్తమైంది. తక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా తెలుగు రాష్ట్రాలు, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం డివిజన్ల పరిధిలో అవసరమైన యంత్రాలు, సామగ్రితో పాటు సిబ్బందిని తక్షణమే అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. తుపాను వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారుల నుంచి నివేదిక కోరారు. తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తుపాను కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని కూడా ఆయన పేర్కొన్నారు.

# మావోయిస్టు పార్టీలో.. అంతర్గత చీలికలు

- మొదటి పేజీ తరువాయి

తాము పీడిత ప్రజల కోసం పనిచేశామని, భవి ష్యత్తు లోనూ పీడిత ప్రజల కోసమే పనిచేస్తామని చెప్పారు. పార్టీకి ఆయుధాలు అప్పగించి వచ్చామ ని చెప్పారు. మావోయిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేవ్ జీ ఎన్నుకున్నారని తెలిపారు. తాను దేవ్ జీని సపోర్ట్ చేస్తున్నట్లు తెలిపారు. దేశమంతా మావో ఐడియాలజీతోనే ఉందని తాము ప్రజల మధ్య ఉండి అదే ఐడియాలజీతో పనిచేస్తామని చెప్పారు. అనారోగ్యం సమస్యలతో లొంగిపోవాల్సి వచ్చిం దని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు పార్టీని వీడాల్సి వచ్చిందని వివరించారు.

**లొంగిపోతే చర్యలుండవ్: డీజీపీ**

జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్ తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్ అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్ వార్? లో చేరారని డీజీపీ చెప్పారు. 1983లో కమాండర్ అయ్యారని,1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారనిఅన్నారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీసభ్యుడయ్యారని, 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్ట్ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారని తెలిపారు. సీఎం రేవంత్రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయార ని డీజీపీ తెలిపారు. మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశార న్నారు. అతని స్వస్థలం మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారని అన్నారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారని వివరించారు. 2014లో స్టేట్ కమిటీ సభ్యుడయ్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్ బాధ్యతలు నిర్వహించారని వివరించారు. బండ ప్రకాశ్పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తామని తెలిపారు. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇవ్వనున్నట్లు చెప్పారు. తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతు " న్నారని, పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కరెక్ట్ కాదని అన్నారు. అవసరమైతే వారికి రక్షణ కల్పిస్తామని డీజీపీ తెలిపారు.

# తరుముకొస్తున్న 'మొంథా' తీవ్ర తుపాను..

- మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు ఆకస్మికంగా పొంగిపొర్లే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొంథా తుపాను ప్రభావం, ప్రభుత్వ సన్నద్ధతపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**తీరం దాటే ప్రాంతంపై ప్రత్యేక దృష్టి**

ప్రస్తుతం మొంథా తుపాను అత్యంత వేగంగా తీరానికి సమీపిస్తోందని, ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నం సహా పలు తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, తుపాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు తక్షణమే మరిన్ని ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించాలని ఆదేశించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యంత్రసామాగ్రి, కమ్యూనికేషన్ పరికరాలు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గడచిన అనుభవాలను, ముఖ్యంగా హుద్‌హుద్ తుపాను సృష్టించిన విధ్వంసాన్ని గుర్తుచేసుకుంటూ, అప్పటి స్ఫూర్తితో కేవలం నాలుగు రోజుల్లోనే ప్రజలను గట్టెక్కించామని, అదే పట్టుదలతో ఇప్పుడు పనిచేయాలని పిలుపునిచ్చారు.

**క్షేత్రస్థాయిలో పక్కా సమాచారం ఉండాలి**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎంత విస్తీర్ణంలో నీరు నిలిచింది, ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో కచ్చితమైన అంచనాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నందున ఎర్రకాలువకు ఎగువ నుంచి ఆకస్మిక వరద ప్రవాహం వచ్చే ప్రమాదం ఉందని, ఆ ప్రాంతంలో అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

**డ్రోన్లతో పర్యవేక్షణ, తక్షణ పునరుద్ధరణ**

తుపాను ప్రభావంతో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 43 వేల హెక్టార్లలో పంట నీట మునిగిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నష్టం ఎక్కువగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా పంట నష్టం వివరాలను రైతులు నేరుగా ప్రభుత్వానికి పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్‌లో మార్పులు చేయాలని సీఎం సూచించారు.

డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాలను, గాలుల కారణంగా కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, టవర్లను గుర్తించి తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి మొబైల్ ఫోన్ల ద్వారా హెచ్చరిక సందేశాలు పంపామని, 2,703 జనరేటర్లను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం పోలీస్ శాఖ 81 టవర్లతో వైర్‌లెస్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. తుపాను కారణంగా రోడ్లపై చెట్లు, స్తంభాలు కూలిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు... అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో తాను ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నానని, యంత్రాంగమంతా క్షేత్రస్థాయిలో ఉందని మంత్రి నారా లోకేశ్ సీఎంకు తెలిపారు. రాయలసీమలో ప్రస్తుతం వర్షాలు లేనందున కృష్ణా నది ప్రవాహాలను అక్కడి చెరువులకు మళ్లించి, ఒక్క టీఎంసీ నీటిని కూడా వృథా చేయవద్దని జలవనరుల శాఖ అధికారులకు చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భీకర తుఫాన్ గా మొంథా

- మొదటి పేజీ తరువాయి

వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అక్టోబర్ 28న తీరం దాటిన తుఫాన్ కారణంగా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఉన్నట్లుగా హెచ్చరించింది. అందులోభాగంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో తదుపరి 2-3 గంటల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇటు హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ కేంద్రం. హన్మకొండ, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, జోగులాంబ గద్వాల్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్ నగర్, మెదక్, నాగర్ కర్నూల్, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తదుపరి 2-3 గంటల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పారు.

సహాయక చర్యల్లో 11 NDRF ,12 SDRF బృందాలు

సహాయ చర్యలు వేగవంతం చేసింది ఏపీ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ అంతటా 11 NDRF ,12 SDRF బృందాలు సిద్ధం చేసింది. పడవలు, లైఫ్ జాకెట్లు, OBMలు, ఈతగాళ్ళు ,వైద్య కిట్లతో ప్రతి సహాయక బృందాలు రెడీగా ఉన్నాయి. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచింది. అత్యవసర అంబులెన్స్ నెట్‌వర్క్‌లు, 108 ,104 వాహనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

**కాకినాడకు డేంజర్ సిగ్నల్..**

కాకినాడకు డేంజర్ సిగ్నల్ జారీ చేసింది వాతావరణ శాఖ. తీరం దాటే సమయంలో గంటకు 90 ననుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు విరుచుకుపడే అవకాశం ఉంది. కాకినాడ జిల్లాలోని 12 మండలాల్లో హై అలర్ట్? ప్రకటించారు. 24 గంటల్లో ఏపీలోని 8 జిల్లాలకు ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. కాకినాడ సముద్ర తీరంలో రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రానికి ఆనుకని ఉన్న గ్రామాల ప్రజలను పునరవాస కేంద్రాలకు తరలిస్తున్నారు అధికారులు. సహాయక చర్యలకోసం కాకినాడ, పిఠాపురం, తాళ్లరేవులో హెలీ పాడ్లు ఏర్పాటు చేశారు.

**ఒడిశా హై అలర్ట్:**

మొంథా తుఫాను ప్రభావం ఆంధ్రప్రదేశ్?తో పాటు ఒడిషాపైన పడింది. ముఖ్యంగా ఒడిశాలోని ఎనిమిది దక్షిణ జిల్లాలు మల్కన్‌గిరి, కోరాపుట్, నబరంగ్‌పూర్, రాయగడ, గజపతి, గంజాం, కలహండి, కంధమల్?పై తీవ్ర ప్రభావం చూపించనుంది. తుఫాన్ నేపథ్యంలో ఒడిషా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో సహకయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా1,496 మంది గర్భిణీ స్త్రీలు సహా దాదాపు 3,000 మందిని తరలించారు. 1445 తుఫాను ఆశ్రయాలను తెరిచారు. 140 రెస్క్యూ బృందాలను మోహరించింది. తుఫాను ప్రభావానికి గురయ్యే తొమ్మిది జిల్లాల్లోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీలకు అక్టోబర్ 30 వరకు సెలవులు ప్రకటించారు.

**తమిళనాడులో భారీ వర్షాలు:**

మొంతా తుఫాను ప్రభావంతో చెన్నై, తిరువళ్లూరు, రాణిపేట, కాంచీపురంతో సహా ఉత్తర తమిళనాడులో మంగళవారం (అక్టోబర్ 28) భారీ నుండి అతి భారీ వర్షాలు కురిశాయి. తుఫాను ఏపీ తీరం దాటిన కూడా ఈ ప్రాంతంలో వర్షాలు కొనసాగుతాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (%=వీజ%) తెలిపింది. తుఫాను ఎఫెక్ట్?తో తిరువళ్లూరు, చెన్నై జిల్లా కలెక్టర్లు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తుఫానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు.

కుండపోత వర్షాలు.. రెడ్ అలర్ట్ జిల్లాలు :

ఆంధ్రప్రదేశ్ : కాకినాడ, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లా, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు

**తెలంగాణ :** ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, సూర్యాపేట,

**ఈదురు గాలులు :**

తీవ్ర తుఫాన్ మొంథా తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. గాలుల తీవ్రతకు చెట్లు కూలిపోవచ్చు. కరెంట్ వైర్లు కట్ అవుతాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతింటుంది.

**రవాణాకు బ్రేక్ :**

తీవ్ర తుఫాన్ మొంథా ప్రభావంతో ఇప్పటికే విశాఖపట్నం, రాజమండ్రి విమానాశ్రయాలు మూసివేత. అన్ని విమాన సర్వీసులు రద్దు చేసిన విమానయాన శాఖ. హైదరాబాద్ శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన అన్ని విమాన సర్వీసులు రద్దు.

**రైళ్లు రాకపోకలు బంద్ :**

విశాఖపట్నం, కాకినాడ నుంచి రాకపోకలు సాగించి 45 రైళ్ల రాకపోకలను రద్దు చేశారు అధికారులు. మరికొన్ని రైలు సర్వీసులను దారి మళ్లించారు.

**బస్సు సర్వీసులు :**

తీవ్ర తుఫాన్ తీరం దాటే కాకినాడ, మచిలీపట్నం, కళింగపట్నం ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు తిరిగే అన్ని బస్సు సర్వీసులను రద్దు చేశారు అధికారులు. ఆయా ప్రాంతాలకు తాత్కాలికంగా బస్సు సర్వీసులు నిలిపివేశారు.

**రెస్క్యూ ఆపరేషన్ :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విపత్తు నివారణ సర్వీసులకు చెందిన 500 బృందాలు ఫీల్డ్ లోకి దిగాయి. తుఫాన్ ముందు.. తర్వాత సహాయ చర్యలు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

**జనం తరలింపు :**

తీవ్ర తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని 50 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది ఏపీ ప్రభుత్వం. తుఫాన్ కేంద్రాలు, ప్రభుత్వ స్కూల్స్, కాలేజీల్లో రిలీఫ్ క్యాంప్స్ ఏర్పాటు చేసింది ఏపీ ప్రభుత్వం. మూడు రోజులు అక్కడే అన్నీ సౌకర్యాలు కల్పించే విధంగా ఏర్పాట్లు చేసింది.

## తుపాను బాధితులకు
# సాయం చేయండి

- మొదటి పేజీ తరువాయి

శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని షర్మిల సూచించారు. "ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే విషయంలో మన నాయకులు ముందుండాలి. ప్రాణనష్టం జరగకుండా చూడటం మనందరి బాధ్యత" అని ఆమె పేర్కొన్నారు. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడమే మన కర్తవ్యమని తెలిపారు. మరోవైపు, మొంథా తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు చెరువులను తలపిస్తుండగా, అనేక లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ప్రజా వ్యతిరేక పాలకులు ఈసారి ఇంటికే

నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కావేరి డెల్టా ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లు, వరద నష్టాల విషయంలో ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుల జీవితాల పట్ల ఉదాసీనత చూపుతూ వారిని మోసం చేస్తోందని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్రంగా ధ్వజమెత్తారు.

డెల్టా ప్రాంతాన్ని ముంచెత్తుతున్న ఎడతెరిపిలేని వర్షాలు వరి పంటలను నాశనం చేయడమే కాకుండా, డీఎంకే ప్రభుత్వ అసమర్థతను, నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేశాయని విజయ్ అన్నారు. "నీటికి నాని మొలకెత్తిన ధాన్యం గింజల్లాగే, డీఎంకే ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో నిరసన కూడా మొలకెత్తి, పెరిగి, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తుంది" అని ఆయన హెచ్చరించారు. కురుస్తున్న వర్షాల నుంచి మిగిలిన ధాన్యం నిల్వలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేకపోయిందని విజయ్ ప్రశ్నించారు. "రైతులపై నిజంగా శ్రద్ధ ఉన్న ప్రభుత్వం వారి జీవనోపాధిని కాపాడటానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సహాయపడుతుంది. కానీ ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తూ, రైతులు కష్టపడి పండించిన పంట వర్షానికి కుళ్లిపోయేలా చేసి పేద రైతులను అణిచివేస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న పేద రైతులకు సకాలంలో కొనుగోళ్లు, గిట్టుబాటు ధర లభించే వ్యవస్థ ఉండాలని విజయ్ నొక్కి చెప్పారు. "ప్రతి ఏటా ఇదే దయనీయ పరిస్థితి పునరావృతమవుతోంది. రైతులు తమ పంటను అమ్ముకొని సంపాదించుకోకుండా స్టాలిన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటుందా?" అని ఆయన నిలదీశారు. డెల్టా ప్రాంత ప్రయోజనాలకు తామే కాపలాదారులమని డీఎంకే చెప్పుకోవడాన్ని విజయ్ ఎద్దేవా చేశారు. "స్టాలిన్ తాను డెల్టా బిడ్డనని గొప్పలు చెప్పుకుంటారు, కానీ ఏటా రైతుల పంటలు వర్షాలకు నాశనమవుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోంది. ఇలాంటి నష్టాలను నివారించడానికి ముందస్తు చర్యలు ఉండక్కర్లేదా? పండించిన ధాన్యాన్ని కాపాడటానికి నిల్వ సౌకర్యాలు మెరుగుపరచవద్దా?" అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. నిల్వ ఉంచిన బస్తాల్లోనే ధాన్యం మొలకెత్తినట్లే, డీఎంకేపై ప్రజా వ్యతిరేకత కూడా ప్రజల మనసుల్లో మొలకెత్తడం ప్రారంభమైందని, ఈ అసంతృప్తి త్వరలోనే బలపడి ప్రజా వ్యతిరేక పాలకులను ఇంటికి పంపిస్తుందని విజయ్ అన్నారు. రైతు వ్యతిరేక కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసి, ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో పంటలను, ప్రజలను కాపాడటానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇది శుభవార్త. లక్షలాది మంది ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం (8%ష్ర జవత్‌తీఖ్రీ ్రాఖఎ జశీఎఎఱంంఱశీఅ%) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర కేబినెట్.. 8వ వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలకు (%వతీఎం శీట =వటవతీవఅఛవ%) ఆమోదముద్ర వేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల చెల్లింపుల పెంపుపై ఈ కమిషన్ త్వరలో తన పనిని ప్రారంభించనుంది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మందికి పైగా పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. వేతన సంఘం ఒక తాత్కాలిక వ్యవస్థలా పనిచేస్తుంది. ఇందులో ఒక ఛైర్‌పర్సన్, ఒక పార్ట్‌టైమ్ సభ్యుడు, ఒక మెంబర్-సెక్రటరీ ఉంటారు. ఈ కమిషన్ తన నియామకం జరిగిన తేదీ నుంచి 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన సిఫార్సులను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే, తుది సిఫార్సులకు ముందే మధ్యంతర నివేదికలు కూడా ఇచ్చే వెసులుబాటును కల్పించారు. సిఫార్సులు చేసేటప్పుడు కమిషన్ పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ నిర్దేశించింది. దేశ ఆర్థిక పరిస్థితి, ఆర్థిక క్రమశిక్షణ ఆవశ్యకత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల లభ్యత వంటి అంశాలను పరిశీలించనుంది. అలాగే, ఈ సిఫార్సుల ప్రభావం రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందో కూడా అంచనా వేయనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు , ప్రైవేట్ రంగంలోని ఉద్యోగుల జీతభత్యాలు, పని పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని నివేదిక రూపొందించాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. ఉద్యోగుల జీతభత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఇతర సేవా నిబంధనలను సమీక్షించి, వాటిలో మార్పులను సూచించడం ఈ కమిషన్ ప్రధాన విధి. ఈ క్రమంలో, 8వ వేతన సంఘం సిఫార్సులు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. 7వ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయగా, దాని సిఫార్సులను ప్రభుత్వం 2016 జనవరి నుంచి అమలు చేసిన విషయం తెలిసిందే. 8వ వేతన సంఘం ఏర్పాటుపై ప్రభుత్వం 2025 జనవరిలో ప్రకటన చేసింది. తాజాగా కేబినెట్ ఆమోదంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందుకు సాగనుంది.

# నిండుకుండలా ముడసర్లోవ రిజర్వాయర్

## భారీ వర్షాలకు రిజర్వాయర్ లో చేరుతున్న వర్షపు నీరు

**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 28:** మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు ముడసర్లోవ రిజర్వాయర్ గరిష్ట స్థాయిలో నీరు చేరుతుంది. రిజర్వాయర్ సమీప ప్రాంతాల కొండలపై నుండి క్యాచ్ మెంట్ ఏరియా నుండి కాలువల ద్వారా నీటి ప్రవాహం చేరుతుంది.

రెండు మూడు రోజులలో కొలిచే భారీ వర్షాలకు రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం మీరు చేరుతుందని వేసవిలో నీటి సమస్యలలు తిరనున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# తుఫాన్ తీరం దాటే వరకు ప్రజలు మరియు అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**పెన్ పవర్ హుకుంపేట అక్టోబర్ 28.**మొంథా తుఫాన్ ఎఫెక్ట్ ను ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు .

అల్లూరి సీతారామ రాజు హుకుంపేట మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ హుకుంపేట మండలం అడ్డుమండ బ్రిడ్జి ని స్వయంగా పర్యవేక్షించారు బారపల్లి బారామోస్య, అడ్డుమండ గడ్డికించుమండ బాకూరు చుట్టుపక్కల ప్రాంతాలలో ఈ రోజు నుంచి తేదీ అనగా 28 29 వరకు బంగాళాఖాతం మరో అల్పపీడనం మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్లో ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వం హెచ్చరిక .

ఈ మూడు రోజుల తుఫాను చాలా వేగవంతంగా ప్రవహించే అవకాశం ఉంది అందువలన ప్రజలు పిల్లలు యువతి యువకులు అప్రవతంగా ఉండాలి. మరియు తమ గ్రామంలో పశువులు కూడా అప్రవత్తంగా ఉంచుకోవాలి .

తుఫాను నేపథ్యంలో హుకుంపేట పోలీస్ స్టేషన్ సి ఐ సన్యాసి నాయుడు మరియు ఎస్ ఐ సూర్యనారాయణ, అధికార యంత్రాంగం ముందస్తుగా అప్రమతంగా ఉండాలని పలు జాగ్రత్తలు తీసుకుంటుంది కావున ప్రజలు అప్రవతంగా ఉండాలి ఈ రోజు మూడు గంటల నుంచి ప్రారంభం అయ్యే అవకాశం ఉంది కనుక ప్రజలంతా వాగులు,చెరువులు ,చెట్ల తోటలు కొండవాగులు, శిధిల వ్యవస్థలో ఉన్న ఇల్లులు కింద ఉండకూడదని ప్రజలంతా అప్రమతంగా ఉండాలని పోలీస్ సిబ్బంది రెడ్డి చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు జరగకూడదని రోడ్డు మధ్యలో కర్రలు పెట్టి సూచించారు మరియు హుకుంపేట మండల టిడిపి ఉపాధ్యక్షులు లకే నాగేశ్వరావు మరియు ఆర్ డబ్ల్యూ ఎస్. జేఈ . ధ్రువ. ఎంపీడీఓ మేడం గారు ఆర్ ఐ. మోహన్ రావు రెవిన్యూ సిబ్బంది సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సీలేరు ప్రధాన రహదారినూతిబందలో భారీ గండి






## వాహనదారుల్లో ఆందోళన

## "మొంథా తుఫాన్"ప్రభావంతో రహదారుల పరిస్థితి దయనీయంగా

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 29"**మొంథా తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు రహదారులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ముఖ్యంగా జీకే వీధి%–%సీలేరు ప్రధాన రహదారిలోని లంకపాకల సమీప నూతిబంద వద్ద మంగళవారం పెద్ద గండి ఏర్పడి ప్రయాణికుల్లో భయాందోళన నెలకొంది. రోడ్డుకి అంచు పూర్తిగా కోతకు గుర్రై, రహదారి బలహీనపడడంతో చిన్న తప్పిదం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే జీకే వీధి ఎస్సై కె. సురేష్, మండల తహశీల్దార్ అన్నాజీ రావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రహదారి ప్రమాదకరంగా మారిందని గుర్తించారు. తక్షణ చర్యగా, బలహీన ప్రాంతాన్ని రాళ్లతో గుర్తులు పెట్టి వాహనదారులు దూరంగా వెళ్లేలా సూచనలు చేశారు. అలాగే, భారీ వాహనాలు ఆ మార్గంలో ప్రయాణించే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్తులు మాట్లాడుతూ, "ఈ రహదారి సీలేరు, జీకే వీధి, చింతపల్లితో పాటు పరిసర గిరిజన గ్రామాలకు ప్రాణాధార మార్గం. తక్షణమే మరమ్మతులు చేపట్టకపోతే పెద్ద ప్రమాదం తప్పదని" ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రహదారి మరింతగా దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు రాత్రివేళల్లో లేదా భారీ వర్షాల సమయంలో ఈ మార్గంలో ప్రయాణించకుండా ఉండాలని ఎస్సై సురేష్, తహశీల్దార్ అన్నాజీ రావు సూచించారు. గ్రామస్థులు ప్రభుత్వం వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



# "మొంథా" తుపాను తీరం దాటే సమయం దగ్గరలోనే

## ఈ 12 గంటలు కీలకం, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక!

**విశాఖ దక్షిణం పెన్ పవర్, అక్టోబర్ 28 :**మొంథా తుపాను మంగళవారం రాత్రి 10 గంటల నుంచి 12 గంటల మధ్య రాజోలు సమీప తీరాన్ని దాటే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (విపత్తు నిర్వహణ) అజయ్ జైన్ తెలిపారు. ప్రస్తుతం తుపాను కాకినాడకు సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉందని, తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

జిల్లా కలెక్టరేట్లో ఎం.పీ భరత్, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ లతో కలిసి జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన తాజా వివరాలు వెల్లడించారు.

"ఈ 12 గంటలు చాలా ముఖ్యమైనవి. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి," అని ప్రజలకు పిలుపునిచ్చారు.

అజయ్ జైన్ తెలిపారు "మొంథా తుపాను ప్రభావం శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు ఉన్న తొమ్మిది జిల్లాల్లో ఉంటుంది. ముఖ్యంగా కాకినా డ, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తీవ్ర ప్రభావం ఉండవచ్చు. ఇప్పటికే 554 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసాం, 31,600 మందిని సురక్షిత ప్రదేశాలకు తరలించాం. కోనసీమ ప్రజలు ఇంటి బయటకు రావద్దని, కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చ రించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతి నకుండా 18 వేల స్తంభాలను సిద్ధంగా ఉంచా మని వివరించారు. కోనసీమ జిల్లా మామి డికుదురులో చెట్టు పడటంతో ఒక మహిళ దురదృష్టవశాత్తు మృతి చెందిందని, అది తప్ప మరే ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తం జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్

జిల్లాలో పరిస్థితులపై కలెక్టర్ వివరాలు ఇలా ఉన్నాయి:

అక్టోబర్ 27 ఉదయం నుంచి 28 ఉదయం వరకు 147 మిల్లీమీటర్ల వర్షపాతం,ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 1.3 సెంటీమీటర్ల వర్షం నమోదయింది.

మంగళవారం వర్షపాతం సోమవారంతో పోలిస్తే తగ్గిందని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని 10 విభాగాల్లో తక్షణ స్పందన బృందాలు సిద్ధంగా ఉన్నాయని, చెట్ల కొమ్మలు, కాలువల పూడికలు తొలగించే పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

ప్రస్తుతం 8 పునరావాస కేంద్రాల్లో 144 మంది ఉన్నారని తెలిపారు. ములగాడ, సీతకొండ వద్ద కొండచరియలు విరిగిపడగా, 14 చెరువులు ప్రమాద స్థితిలో ఉన్నాయని చెప్పారు.

జిల్లాలో 119 చెట్లు కూలగా, వాటిలో 60 తొలగించామని తెలిపారు. అలాగే విద్యుత్ అంతరాయం లేకుండా 35 నీటి ట్యాంకులు సిద్ధం, 2 జాతీయ విపత్తు సహాయక దళాలు (ఎన్డీఆర్ఎఫ్), 1 రాష్ట్ర విపత్తు సహాయక దళం (ఎస్డీఆర్ఎఫ్) బృందాలు (మొత్తం 90 మంది సిబ్బంది) పూర్తిస్థాయిలో విధుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 0891-2590100, 96669 09192, 1800-425-00009 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

తుపాను తీవ్రత దృష్ట్యా బుధవారం కూడా అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

"ఇది సరదా సమయం కాదు" ఎం.పీ.భరత్ హెచ్చరిక

కొంతమంది తీరప్రాంతాల్లో తుపాను మధ్యలో చిత్రాలు తీసుకుంటున్నారని, దయచేసి అలా చేయవద్దని ఎం.పీ భరత్ విజ్ఞప్తి చేశారు.

"ఇది వినోద సమయం కాదు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దు," అని ఆయన హెచ్చరించారు.

అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసిస్తూ, "పట్టణాల్లో పరిస్థితి సాధారణం గానే ఉంది కానీ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండొచ్చు. అందుకే ఫోన్లు పూర్తిగా ఛార్జ్ పెట్టుకోవాలి" అని సూచించారు.

"హుద్హుద్ తుపాను చేసిన విధ్వంసం అందరికీ గుర్తుంది. ఈసారి అలాంటి నష్టం జరగకూడదని దేవుణ్ని ప్రార్థిస్తున్నాను," అని భరత్ తెలిపారు.

# "ప్రకృతికి మార్గం ఇచ్చి ఉంటే, మన రహదారులు మునిగేవి కావు"

## మొంథా బీభత్సం! విశాఖలో రోడ్లు, కాలువలు సముద్రాలుగా మారాయి

## త్రాగునీటి నిలిపివేతపై ప్రజల ఆగ్రహం

**ములగాడ,పెన్ పవర్, అక్టోబర్ 28 :**మొంథా తుఫాన్ ప్రభావంతో విశాఖపట్నం నగరమంతా బీభత్స దృశ్యాలను చూపించింది. తుఫాన్ ఉధృతికి వృక్షాలు వేలు పాతి నేలకొ రిగి, కాలువలు, రహదారులు, కొండచరియలు పాడైపోయాయి. ఎన్నడూ లేని విధంగా నగర వీధులు సముద్రాల్లా మారి ప్రజా రవాణా నిలిచిపోయింది.

ములగాడ ప్రాంతం మీదుగా నగరానికి వచ్చే మార్గాలన్నీ నీటి ప్రవాహంతో దిగ్బంధం అయ్యాయి. పశ్చిమ నియోజకవర్గంలోని ఏకేసి కాలనీ పూర్తిగా నీటిమునిగిపోయింది. 40వ వార్డులోని పంపు హౌస్ విద్యుత్ కనెక్షన్ లోపం కారణంగా త్రాగునీటి పంపింగ్ నిలిచిపోయింది. ఫలితంగా ప్రజలు గంటల తరబడి త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ ముందు గానే అన్ని శాఖలకు 24 గంటలు సర్వీసులో ఉండాలని సూచించినప్పటికీ, త్రాగునీటి శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారని ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. విద్యుత్, ఆస్పత్రులు, త్రాగునీరు ఇవి అత్యవసర సేవలు. వీటిని నిర్లక్ష్యం చేయడం సరికాదు అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధ వారానికల్లా త్రాగునీటి సరఫరా పునరుద్ధరించాలని వారు అధికారులను కోరుతున్నారు.

ఇదిలావుండగా, పూర్వం ములగాడ చివర ప్రాంతంలో వందల ఎకరాల్లో ఉన్న ముళ్ళ చెట్లు, చెరువులు నీటి ప్రవాహాన్ని నియంత్రిం చేవి. అయితే ఆ ప్రాంతాల్లో ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలు చేపట్టిన అభివృద్ధి పనుల కారణంగా చెరువులు నింపివేయబడి, గెడ్డలు కుదించబడ డంతో నీరు నేరుగా రహదారులపై ప్రవహించి ప్రమాదకర పరిస్థితులు సృష్టిస్తోంది.





"మునుపటి సహజ ప్రవాహ మార్గాలను పాడు చేసిన ఫలితమే ఈ విపత్తు" అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా కలెక్టర్, జీవీఎంసీ అధికారులు మేలుకొని గెడ్డలు, చెరువుల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# దారకొండలో వైసీపీ నూతన పంచాయితీ కమిటీ ఎన్నికల

మెడికల్ కళాశాలల ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 28:**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అల్లూరి సీతారామ రాజు జిల్లా వైసీపీ అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు సూచనలతో, జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో, దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు అధ్యక్షతన సోమవారం దారకొండ పంచాయితీ పరిధిలో "వైసీపీ నూతన పంచాయితీ కమిటీలు ఎన్నిక" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా దారకొండ పంచాయితీ పార్టీ అధ్యక్షుడిగా పిల్ల నాగ వెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. అలాగే, పంచాయితీ ప్రధాన కార్యదర్శిగా రెడ్డి ఆనంద రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తదనంతరం ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా, పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో "కోటి సంతకాల సేకరణ" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ వైసీపీ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, 2029లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేయాలనే లక్ష్యంతో అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు సాయంతో పరిష్కరింపజేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మాడి రామన్న, మొట్టడం సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటి బాబు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణరావు, నాయకులు వంతల చిట్టిబాబు, పోతురాజు జగన్నాధం, మత్స్యరాస గజపతి రాజు, కొట్టెక్కి ప్రసాద్, కిముడు రాంబాబు, పాంగి పుల్లయ్య, రౌతుల రాంబాబు, సెట్టి సత్తిబాబు, దారబాబు, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు. దారకొండ, నిమ్మచెట్టు, తోకరాయి, దబ్బకోట, కొంగపాకలు, అగ్రహారం, గంగవరం వంటి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి...

* జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ఛార్జ్ సూర్యచంద్ర....






**నాతవరం,పెన్ పవర్ (అక్టోబర్ 28):** మొంథా తుపాన్ నేపథ్యంలో నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ఛార్జ్,బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర కోరారు. మంగళవారం నాతవరం మండలం శరభవరం ఏలేరు కాలువను పరిశీలించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. తుపాన్ నేపథ్యంలో ఏ ఒక్కరికి ప్రాణహాని జరగకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికార యంత్రాంగానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. తుపాన్ తీరం దాటే సమయంలో దాటిన తర్వాత అత్యంత వేగంగా గాలులు వీయనున్నాయని,వర్షపాతం అత్యధికంగా నమోదు కానుండటంతో ప్రజలందరిని అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ బయటకు రాకూడదన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, గుడిసెలు,పాత శిధిల భవనాల్లో ఉన్న ప్రజలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని,పునరావాస కేంద్రాలలో మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉ పాధ్యక్షులు వూడి చక్రవర్తి, జిల్లా సెక్రటరీలు అల్లాడ సురేష్,పంచాడ హరినాధ్, నాతవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ,సీనియర్ నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు,వర్రె నరసింహ,మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 3,15,23,000 సొమ్ము మంజూరు...!

* ఎంపీడీవో జీడివి ప్రసాదరావు వెల్లడి




**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 28** :మండలంలో 7,499 మంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల లబ్దిదారులకు గాను రూ.3,15,23,000 సొమ్ము మంజూరైనట్లు ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. ఈనెల 31వ తేదీన పెన్షన్ సొమ్మును బ్యాంకుల నుంచి విత్ డ్రా చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. నవంబర్ 1వ తేదీ ఉదయం నుంచి లబ్దిదారులకు పెన్షన్లను పంపిణీ చేయాలని సూచించారు. లబ్ధిదారులందరూ ఇళ్ల వద్దే అందుబాటులో ఉండి, సహకరించాలని ఎంపీడీవోకోరారు.

# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో అన్ని విభాగాలు సమన్వయంతో చర్యలు





* క్షేత్ర స్థాయిలో యువ నాయకుడు ఐటీ మంత్రి నారా లోకేష్ చురుకైన సమన్వయం
* తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**గాజువాక: పెన్ పవర్,అక్టోబర్ 28** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యారాడ ప్రాంతంలో ఇరిగిపోయిన కొండచరియలు, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు, డ్రైనేజ్ వాటర్ ఓవర్‌ఫ్లో అవుతున్న ప్రాంతాలను మరియు ఇతర ప్రభావిత ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి బాధితులను పరామర్శించారు. స్థానిక ప్రజల పరిస్థితిని తెలుసుకొని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.మెంథా తుఫాన్ ఉగ్రరూపం దాల్చబోతున్నందున, రాబోయే 24 గంటలు అత్యంత కీలకమైనవిగా మారాయి. తీరప్రాంతాల్లో బలమైన గాలులు, భారీ వర్షాలు విస్తరించే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, అవసరం లేని బయటకు వెళ్లడాన్ని నివారించాలి," అని రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

పరిస్థితి చేయజారిపోకముందే నాయకులు అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సిద్ధంగా ఉండాలి. ప్రజల భద్రతే మన ప్రథమ కర్తవ్యం అని ఆయన స్పష్టం చేశారు తీరప్రాంతం, కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ఇప్పటికే ప్రభుత్వం సురక్షిత వసతిగృహాలకు తరలించారని తెలిపారు.

తుఫాన్ సహాయక చర్యల్లో టీడీపీ, కూటమి నాయకుల చురుకైన భాగస్వామ్యం

టీడీపీ మరియు కూటమి కార్యకర్తలు ఈ సహాయక చర్యల్లో ముందుండి సేవలందిస్తున్నారని ఆయన తెలిపారు. రాబోయే 48 గంటలపాటు కూడా ఇదే క్రమశిక్షణ, నిబద్ధత కొనసాగించాలి. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు తోడుగా, అధికారులకు అందుబాటులో ఉండాలి అని పల్లా శ్రీనివాసరావు సూచించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని, ఆయనే స్వయంగా విభాగాల పనితీరును సమీక్షిస్తూ ప్రాణ, ఆస్తి రక్షణకు చర్యలు తీసుకుంటున్నారని పల్లా వివరించారు. యువ నాయకుడు నారా లోకేష్ గత రెండు రోజులుగా ఆర్టీజీఎస్ కంట్రోల్ రూమ్‌లో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, ఫీల్డ్ స్థాయి సమస్యలను రియల్ టైమ్‌లో పరిష్కరిస్తున్నారు. ఆయన కృషి, నిబద్ధత అభినందనీయమైనవి అని అన్నారు.

వైఎస్సార్సీపీ నేతల తప్పుడు ప్రచారం ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తోందని

ఈ అత్యవసర సమయంలో కూడా వైఎస్సార్సీపీ సోషల్ మీడియాలో పాత తుఫాన్ల హుద్‌హుద్, టిట్లీ చిత్రాలు, వీడియోలను ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాన్ని రేకెత్తించడం ఖండనీయమని పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. సహాయం చేయలేకపోతే కనీసం ప్రజల్లో భయం సృష్టించకండి. సామాజిక మాధ్యమాలను బాధ్యతగా వాడండి. మనమందరం ఐక్యంగా ఈ సవాళ్లను ఎదుర్కొని నిలబడతాం అని పల్లా గారు అన్నారు.

ఈ కష్టసమయంలో ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా వైఎస్సార్సీపీ పాత తుఫాన్ల ఫోటోలు, వీడియోలు ప్రచారం చేయడం చాలా బాధాకరం. ఇది ప్రజల్లో గందరగోళం, భయాందోళనలు సృష్టించడానికి చేసిన అప్రజాస్వామిక చర్య,అని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఈ విపత్తు సమయంలో రాజకీయాలను పక్కనపెట్టి ప్రజల భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలి. సహాయం చేయలేకపోయినా, కనీసం అబద్ధపు ప్రచారాలతో భయం వ్యాప్తి చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలి అని ఆయన పిలుపునిచ్చారు.



# పనసలొద్దీ గ్రామంలో ఇంటిపై కూలిన వృక్షం-మెరుపువేగంతో స్పందించిన పోలీసులు





**గ్రామస్తుల ప్రశంసల వెల్లువ**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల పరిధిలోని రింతాడా పంచాయతీ పనసలొద్దీ గ్రామంలో మంగళవారం ఉదయం పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన కొర్ర పెద్దమ్మి ఇంటిపై భారీ చింత చెట్టు అకస్మాత్తుగా విరిగి పడటంతో గ్రామంలో కలకలం చెలరేగింది. చెట్టు కూలిన సమయంలో ఇంటిలో మహిళలు, చిన్నపిల్లలు ఉండటంతో తీవ్ర భయాందోళన నెలకొంది. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. చెట్టు కొమ్మలు గృహంలోకి చొచ్చుకుపోవడంతో ఇంట్లోని సామాన్లు, పైకప్పు భాగం దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే జీకే వీధి ఎస్సై కె. సురేష్ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో చెట్టును తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. పోలీసులు మరియు గ్రామస్థుల కృషితో చెట్టును పూర్తిగా తొలగించి, కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై కె. సురేష్ మాట్లాడుతూ, "గ్రామాల్లో పాత చెట్లు వర్షాల కారణంగా బలహీనపడే అవకాశం ఉంది. ఇలాంటి చెట్లు గమనించిన వెంటనే ప్రజలు సమాచారం ఇవ్వాలి. ముందస్తు చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు" అని సూచించారు. గ్రామస్తులు మాట్లాడుతూ, "పోలీసులు పిలిచిన వెంటనే వచ్చి సహాయ చర్యలు చేపట్టడం అభినందనీయం. సమయానికి స్పందించకపోతే పెద్ద ప్రమాదం జరిగేదే" అని ప్రశంసల వర్షం కురిపించారు. చెట్టు కూలిన ఇంటి యజమానురాలు ఇల్లు దెబ్బ తినడంతో ప్రభుత్వం తనకు నష్టపరిహారం మంజూరు చేయాలని కోరారు. ఈ ఘటనతో గ్రామంలోని ఇతర కుటుంబాలు తమ ఇళ్ల చుట్టుపక్కల ఉన్న పాత చెట్లను పరిశీలించి జాగ్రత్తలు ఎస్ఐ సూచించారు.

# మాక్స్ సొసైటీ తరపున రోడ్డు ప్రమాద మృత సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం



* సురవరం గ్రామం వాసి దావీదు రెడ్డి కుటుంబానికి రూ 5,000 నగదు అందజేత
* 63 వేల రూపాయల రుణం మాఫీ

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 29**:ఇటీవల పెంటపాడు బ్రిడ్జి సమీపంలో జరిగిన బైక్ ప్రమాదంలో మృతి చెందిన సురవరం గ్రామానికి చెందిన వాసిరెడ్డి దావీదు రెడ్డి కుటుంబానికి శ్రీ మహిళా మా తోట మాక్స్ సొసైటీ తరపున ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. సొసైటీ మేనేజర్ జల్లి బాబురావు తెలిపారు దహన ఖర్చుల నిమిత్తం కుటుంబానికి ?5,000 రూపాయలు అందజేశారు. అలాగే, మరణానికి కొద్ది రోజుల ముందే దావీదు రెడ్డికి కాఫీ తోటల్లో వీడింగ్ పనులు చేపట్టేందుకు రూ 70,000 లోన్ మంజూరు చేసినట్లు తెలిపారు. మానవతా దృక్పథంతో పాటు సొసైటీ నిబంధనల ప్రకారం, దావీదు చెల్లించవలసిన ?63,000 బాకీ రుణాన్ని సీఈవో నెల్లూరు వెంకట సత్యనారాయణ మాఫీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దావీదు రెడ్డి భార్య జ్యోతికి నామినీగా ఈ నగదు సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ ఎల్వి సుబ్బారావు, డైరెక్టర్ బురిటి ఈశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఆఫీస్ అసిస్టెంట్ బి. పుణ్యవతి, సురవరం గ్రామస్థులు, మాక్స్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. గ్రామస్తులు సొసైటీ మానవతా దృక్పథాన్ని అభినందించారు.

# తుఫాన్ తీరం దాటే వరకు ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలి..

* పాత భవనాలు మరియు మట్టి గోడలు ఉన్న ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.
* పంచాయతీ సెక్రెటరీ సత్యనారాయణ




**పెన్ పవర్ హుకుంపేట అక్టోబర్ 28**
తుఫాన్ గురించి హుకుంపేట గ్రామపంచాయతీ అంతా మైక్ అనౌన్స్మెంట్ చేసి ప్రజలను అప్రమత్తం చేసారు మరియు వర్షం నీరు వెళ్లే విధంగా డ్రైనేజీలు శుభ్రం చేయించారు ఇతర పారిశుధ్య సామాగ్రి సిద్ధంగా పెట్టుకోవడం జరిగింది, అని అయన తెలిపారు మరియు ఎలక్ట్రికల్ సిబ్బంది తో మాటలాడి అనివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని అయన అన్నారు, మరియు హుకుంపేట ప్రజలు ఏది అయినా అత్యవసర పరిస్థితుల్లో 9959552320, 94939 46665, 94411 07551 కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా గ్రామపంచాయతీ కార్యదర్శి అన్నారు

# తుఫాన్ ప్రభావిత వర్షాల కారణంగా వరి పొలాలల పరిశీలన

◆ రైతులకు సూచనలు, ఉచిత విత్తనాలు అందజేత

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 29:**"మొంథా తుఫాన్" ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో గూడెం కొత్త వీధి మండలంలో చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఎడిఆర్ అప్పలస్వామి, సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తిరుమల రావు, మరియు మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు, చింతపల్లి వ్యవసాయ అధికారి మధుసూదన్ రావు స్థానికంగా పర్యటన నిర్వహించారు.రింతాడ, అసరాడ, ఏబులం గ్రామాల్లోని వరి పొలాలను పరిశీలించి, అధిక వర్షాల కారణంగా పొలాల్లో చిన్నచిన్న కాలువలు ఏర్పాటు చేసి అదనపు నీటిని తొలగించాలని రైతులకు సూచించారు.వర్షం ఎక్కువగా కురిసినందున మానిపండు తెగులు కొన్ని పొలాల్లో కనిపించాయని, దీని నివారణకు ప్రొపికోనాజోల్ పొడి మందును పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా, ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ద్వారా రైతులకు పప్పు ధాన్య పంటలైన మినుముల విత్తనాలు ఉచితంగా అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. రైతులు ఈ సూచనలను పాటించడం ద్వారా తుఫాన్ కారణంగా పంటలకు వచ్చే నష్టాన్ని తగ్గించగలరని అధికారులు అన్నారు.



## తాండవ ప్రాజెక్టును పరిశీలించిన యువ నాయకులు రాజేష్ బాబు ?'మొంథ' తుఫాన్ ప్రభావంపై అప్రమత్తత అవసరం....





◆ అధికారులకు సూచనలు...

**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 28):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు యువ నాయకులు కౌన్సిలర్ రాజేష్ బాబు 'మొంథ' తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తాండవ ప్రాజెక్టును పరిశీలించారు.ఈ పర్యటనలో ఆయన తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ,ప్రాజెక్ట్ అధికారులు డి ఈ,ఏఈ లతో సమావేశమై ప్రాజెక్టును సందర్శించారు.?ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్ద ఉన్నటువంటి ప్రస్తుత నీటి నిల్వలు వాతావరణ పరిస్థితులను రాజేష్ బాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా,అంటే వర్షాలు అధికంగా కురిసినా లేదా తక్కువగా ఉన్నా తక్షణమే చేపట్టాల్సిన చర్యల గురించి స్పీకర్ ఆదేశాలను ఆయన అధికారులకు స్పష్టం చేశారు.?ప్రాజెక్టు పరిస్థితిని నిత్యం నిశితంగా పరిశీలిస్తూ ఈ విషయాలను ఎప్పటికప్పుడు స్పీకర్ కి కూడా తెలియజేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా కోరినట్లు రాజేష్ బాబు తెలియజేశారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీర సూర్య చంద్ర, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా వెంకట కృష్ణారావు, నాతవరం పిఏసిఎస్ అధ్యక్షులు అప్పు రెడ్డి మాణిక్యం,మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి,తాండవ ప్రాజెక్ట్ డిఇ అనురాధ,మండల తాసిల్దార్ ఏ.వేణుగోపాల్, ఎంపీడీవో ఎం.సత్య శ్రీనివాస్, ఎస్సై వై.తారకేశ్వరరావు, టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కౌన్సిలర్ రాజేష్ బాబు.....





**బాధితులకు 150 దుప్పట్లు పంపిణీ.....**

**జనరేటర్ ఏర్పాటుకు ఆదేశాలు....**

**నాతవరం, పెన్ పవర్ (అక్టోబర్ 28):** స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు యువ నాయకులు కౌన్సిలర్ రాజేష్ బాబు 'మొంథ' తుఫాన్ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. తొలుత తాండవ ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం, ఆయన నాతవరం మండలం మాధవ నగరం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు.
?ఈ సందర్భంగా కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలతో రాజేష్ బాబు స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు,ఇతర ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.?ముఖ్యంగా, చలి తీవ్రత కారణంగా ఇబ్బంది పడుతున్నామని, దుప్పట్లు కావాలని బాధితులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై తక్షణమే స్పందించిన రాజేష్ బాబు తన సొంత నిధులతో 150 దుప్పట్లను తెప్పించి బాధితులకు పంపిణీ చేశారు.
?అదేవిధంగా పునరావాస కేంద్రంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకుని తక్షణమే జనరేటర్ ఏర్పాటు చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు చైర్మన్ శ్రీ కరక సత్యనారాయణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీర సూర్య చంద్ర, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా వెంకట కృష్ణారావు,నాతవరం పిఏసిఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం, మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి,టిడిపి సీనియర్ నాయకులు గంటా శ్రీనివాసరావు,యువ నాయకులు గోవిందు, తాసిల్దార్ ఏ.వేణుగోపాల్, ఎంపీడీవో ఎం సత్య శ్రీనివాస్,ఎస్సై వై తారకేశ్వరరావు అధిక సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు అప్రమత్తంగా ఉండాలి.




**గుమ్మలక్ష్మీపురం మండలం.ఏవో శంకర్రావు.**

**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 28. పెన్ పవర్.**మండలంలో కుక్కిడి, మరియు జాతపు కోట పాడు గ్రామ రైతుల క్షేత్రాలను మంగళవారం నాడు ఏవో శంకర్రావు పరిశీలించి మొంథా తుఫాన్ పై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు,ప్రజలు ఈ మూడు రోజులు పాటు ఈ నెల 30వ తారీకు వరకు రైతులు జాగ్రత్త గా ఉండాలని ఎప్పటికి కప్పుడు పంట పొలాలలో పడిన వర్షపు నీటిని 48 గంటల్లోగా బయట కు నీటిని పంపించాలి,ముఖ్యంగా పత్తి మరియు మొక్క జొన్న పండించే రైతులు చాలా జాగ్రత్త గా ఉండాలి తుఫాన్ తగ్గిన వెంటనే వరి మరియు పత్తి లో బూస్టర్ డోస్ క్రింద 20 కేజీల యూరియా మరియు 25 కేజీ ల పోటాష్ తప్పనిసరిగా వెయ్యాలి అని సూచించారు.పత్తి లో కాండం కుళ్ళు తెగులు వచ్చే అవకాశం వుంది కాబట్టి దీని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్,ఎకరానికి 600 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చెయ్యాలి.అలానే వరి లో మాడి పండు,తెగులు వస్తుంది దీని నివారణకు ప్రొపైకోనాజోలు 200 గ్రాములు 200 లీటర్ల నీటి లో కలిపి పిచికారీ చెయ్యాలని రైతులకు ఏవో శంకర్రావు సూచించారు.ఆయన వెంట సచివాలయం సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.




## జనతాకాలనీ పర్యటించిన వార్డు ఇంచార్జి దాడి రమేష్ నాయుడు



◆ నీటి మునిగిన సమస్యల పరిష్కారానికి చర్యలు

**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 28 :**మన ప్రియతమ నాయకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు, వర్షాల వలన తీవ్రంగా ప్రభావితమైన జనతా కాలనీ ప్రాంతంలో నీటి మునిగిన వీధులను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ పర్యటనలో వార్డు ఇంచార్జి దాడి రమేష్ నాయుడు, వార్డు అధ్యక్షులు కంపర ఆనంద్, జీవీఎంసీ జోన్ కమిషనర్ శంకరరావు, సానిటరీ డిపార్ట్మెంట్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పర్యటన సందర్భంగా అధికారులు ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, వర్షపు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడం, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పద్మ, లత, గొన్నబత్తుల రాజు, గోంతిన శ్రీను, రాజేష్, గణేష్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు నాయకుల పర్యటన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు.



## అత్యవసర సమయాల్లో బయటకు రండి...!

◆ మండల ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి




**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 28:**అత్యవసర సమయాల్లో బయటకు రావాలని మండల ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. మొ%శీ%థా తుఫాను కారణంగా రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండి అత్యవసర సమయాల్లో బయటకు రావాలని పోలీసులు పిలుపునిచ్చారు. గెడ్డలు, వాగులు దాటవద్దని, భారీ వృక్షాలు వద్ద నిలబడు వద్దని, అత్యవసర సమయాల్లో ప్రయాణాలు చేయాలని గ్రామస్తులకు హితబోధ చేశారు. అలాగే మండలంలోని నలుమూలల పోలీస్ సిబ్బంది పర్యటించి ప్రజలకు తుఫాను పట్ల పలు సూచనలు సలహాలు అందిస్తున్నారు. చింతాలమ్మ ఘాట్లో కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ పర్యవేక్షించి వాహన రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సలహాలు అందించి వాహనాలను యధావిధి తిరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. డౌనూరు సమీపంలో రోడ్డు అడ్డంగా భారీ వృక్షం నేలకొరకడంతో పోలీసులు అప్రమత్తమై చెట్టును తొలగించారు దీనితో రాకపోకలు యధావిధిగా సాగాయి. మండలంలోని తుఫాన్ కారణంగా ఎటువంటి విపత్తు జరిగిన తమకు తెలియపరచాలని కొయ్యూరు పోలీస్ లు గ్రామస్తులకు కోరుతున్నారు.

## తుఫాన్ సందర్బంగా గ్రామాలను సందర్శించిన సర్పంచ్ రామకృష్ణ

◆ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 29:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ మంగళవారం మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను స్వయంగా సందర్శించారు.తుఫాన్ కారణంగా పంచాయతీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు మరింతగా కురిసే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.సర్పంచ్ రామకృష్ణ దామనపల్లి చెరువు వద్ద ఉన్న ప్రధాన రహదారి కల్వర్టును పరిశీలించి, తుఫాన్ కారణంగా వచ్చిన వరదల వల్ల రహదారి దెబ్బతిన్నదేమో అని ఆరా తీశారు.అలాగే గొడుగుమామిడి, పిప్పళ్ళదొడ్డి, సిగునాపల్లి, రాంనగర్, కోలని తదితర గ్రామాలను సందర్శించి, గ్రామస్థుల పరిస్థితిని తెలుసుకున్నారు. ఏమైనా నష్టం జరిగితే వెంటనే తమకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.సర్పంచ్ మాట్లాడుతూ, "మొంథా తుఫాన్ కారణంగా మండలంలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ సూచనలను పాటించాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్రయ్య, సతీష్, శ్రీను, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామస్థులు తుఫాన్ సమయంలో సర్పంచ్ స్వయంగా గ్రామాలకు వచ్చి పరిస్థితులు పరిశీలించడం పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు.

## హిందూవులకు క్రైస్తవులకు మధ్య ఘర్షణ

◆ క్రైస్తవ మత ప్రచారకులను అడ్డుకున్న హిందువులు



**కొయ్యురు, పెన్ పవర్ అక్టోబర్ 28 :**మండలంలోని మర్రివాడ క్రైస్తవ ప్రచారకులను మంగళవారం హిందువులు అడ్డుకున్నారు. రాజేంద్రపాలెం కు చెందిన ఆర్ఎంపీ డాక్టరుఆనంద్, వంకల లక్ష్మణరావు తోపాటు పాస్టర్ ఇద్దరు వ్యక్తులను మర్రివాడ గ్రామంలో నిలదీశారు. మా గ్రామంలో క్రైస్తవ మత ప్రచారం చెయ్యొద్దు అంటూ హెచ్చరించారు. ఇకపై మా గ్రామంలో క్రైస్తవ మత ప్రచారం చేయవద్దని గట్టిగా బదులిచ్చారు దీనితో క్రైస్తవ సంఘం నాయకులు వెనుతిరి గారు .

# పద్మనాభనగర్, కాలాసికాలనీలో వర్షపు నీటితో మునిగిన ఇళ్లు

తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు





**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 28 :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పద్మనాభనగర్ పరిధిలోని 92వ వార్డు కాలాసి కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చొరబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ వీధులు చెరువుల్లా మారిపోవడంతో వాహనాలు, నడకదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి ప్రతి సంవత్సరం వర్షాకాలంలో చోటుచేసుకుంటున్నప్పటికీ, అధికారులు ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోకపోవడం కాలనీవాసుల్లో ఆగ్రహం రేకెత్తిస్తోంది. గతంలోనూ పలుమార్లు వర్షాల సమయంలో ఇళ్లలో నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో పద్మనాభనగర్ గ్రామాభ్యుదయ యువజన సేవాసంఘం అధ్యక్షుడు నందవరపు సోములు స్వయంగా కాలనీ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వర్షపు నీటితో ఇళ్లలోకి ప్రవేశించిన మురుగు, చెత్త కారణంగా ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ "ప్రతిసారి వర్షాలు పడితే ఈ కాలనీ నీటమునిగిపోవడం సర్వసాధారణం అయిపోయింది. కొండ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు ఇక్కడే నిలిచిపోతుంది. గెడ్డ కాలువలు, డ్రైనేజ్ వ్యవస్థ సరైన రీతిలో లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని మేము కోరుతున్నాం,"

అని తెలిపారు. సంబంధిత మునిసిపల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు తక్షణమే కాలనీని సందర్శించి, తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాలాపు శ్రీనివాసరావు, కొల్లి శ్రీనివాసరావు, రాజాన మహేష్, రాజాన సతీష్, ఈగల నవీన్, నెమ్మాది చరణ్, సేనపతి సీతమ్మ నాయుడు, నందవరపు హరినాథ్ తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు. కాలనీవాసులు కూడా భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా శాశ్వత కాలువలు నిర్మించి వర్షపు నీటిని సమీప గెడ్డ కాలువలలోకి మళ్లించే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

## సాయి దుర్గానగర్ కాలనీలో తీవ్ర వర్షం ప్రభావం

- జీవీఎంసీ 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా పర్యవేక్షణ





**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 28 :** మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో సాయి దుర్గానగర్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిరంతర వర్షపాతం కారణంగా కాలనీలోని ప్రధాన వీధులు నీటమునిగిపోగా, కొంతమంది నివాసితులు ఇళ్లలోనే చిక్కుకుపోయారు. వర్షపు నీరు నిలిచిపోవడంతో డ్రైనేజ్ వ్యవస్థ కూడా స్తంభించింది. ఈ పరిణామంపై జీవీఎంసీ 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా వెంటనే స్పందించారు. కాలనీవాసుల ఫిర్యాదులను స్వీకరించిన ఆయన, జీవీఎంసీ ఇంజనీర్ మరియు సంబంధిత సిబ్బందిని సంఘటన స్థలానికి పిలిపించి, సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలనీ మొత్తం పర్యవేక్షణ జరిపిన అనంతరం, రాపర్తి కన్నా అధికారులతో సమావేశమై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థల పరిశీలనలో ఆయన మాట్లాడుతూ, "కాలనీలో ఇన్ఫ్లో వాటర్ ఎక్కువగా ఉండడం, అలాగే అవుట్ ఫ్లో మార్గాలు తగినంత లేకపోవడం వల్ల నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా బిఆర్టిఎస్ వంతెన వద్ద నీరు బయటకు పోయే మార్గం చాలా తక్కువగా ఉండటమే ప్రధాన కారణం" అని వివరించారు. కాలనీ ప్రజల భద్రత కోసం తాత్కాలిక పంపులు ఏర్పాటు చేయడం, డ్రైనేజ్ లైన్లు శుభ్రం చేయడం, అవసరమైతే నీటిని మళ్లించేందుకు తాత్కాలిక మార్గాలు సృష్టించడంపై అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కాలనీ వాసులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ప్రతి భారీ వర్షం సమయంలో ఇదే పరిస్థితి వస్తుంది. కాలనీ ముంచెత్తే పరిస్థితి వస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని మనస్పూర్తిగా కోరుతున్నాం" అని తెలిపారు. కాలనీలో నీటిమునిగిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పడంతో పాటు, జీవీఎంసీ ద్వారా తగిన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# తుఫాను తీవ్రతపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు హెచ్చరిక

- ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచన
- మధ్యాహ్నం తర్వాత తుఫాను తీవ్రత పెరిగే అవకాశం
- ప్రభుత్వం, అధికారులు పూర్తి అప్రమత్తం



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 28:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హెచ్చరిక మేరకు, ఈరోజు మధ్యాహ్నం తర్వాత తుఫాను తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విశాఖ జిల్లా తీర ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెళ్లకూడదని సూచించారు. తుఫాను ప్రభావిత ప్రాంతమైన ముత్యాలమ్మపాలెం సముద్రతీరాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గత రెండు రోజులుగా తుఫాను తీవ్రతపై రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రకటనలు చేసింది. దానికి అనుగుణంగా అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు సురక్షితంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం," అన్నారు.

"ప్రభుత్వ సూచనలను తప్పక పాటించండి. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రాకండి. మధ్యాహ్నం తర్వాత గాలులు తీవ్రంగా వీచే అవకాశం ఉంది. చెట్లు పడిపోవడం, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, పిడుగులు పడడం వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది," అని హెచ్చరించారు. అదేవిధంగా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆశ్రయ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని తెలిపారు. "ఆశ్రయ కేంద్రాల్లో భోజన వసతి, వైద్య సదుపాయాలు, తాగునీరు, కరెంటు వంటి అవసరాలను సమకూర్చాం. విద్యుత్ శాఖ, రెవిన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖల అధికారులు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నారు. ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే స్థానిక అధికారులను సంప్రదించండి," అని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలిపారు.

పాత భవనాలు, గోడలు, విద్యుత్ స్తంభాల దగ్గర నిలవకూడదని, చెట్ల క్రింద వాహనాలు నిలపరాదని ఆయన ప్రజలను జాగ్రత్తపరిచారు. "ప్రజల భద్రత మా ప్రాధాన్యత. అన్ని శాఖల అధికారులు ఫీల్డ్‌లో ఉన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే సమాచారం ఇవ్వండి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మీ పక్కనే ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తుఫాను పరిస్థితిపై అత్యవసర నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. అధికారులు, సిబ్బంది అన్ని ప్రాంతాల్లో సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు.

# నీటి మునిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే గణబాబు, జీవీఎంసీ కమిషనర్ పర్యవేక్షణ

ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు విప్ గణబాబు హామీ







**మల్కాపురం, పెన్ పవర్, అక్టోబర్ 28 :** విశాఖ నగరాన్ని గత రెండు రోజులుగా ముంచెత్తుతున్న భారీ వర్షాల ప్రభావం మల్కాపురం పరిసర ప్రాంతాలపై తీవ్రంగా పడింది. ముఖ్యంగా ఏకేసి కాలనీలో వర్షపు నీరు నిలిచి, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు మరియు జీవీఎంసీ కమిషనర్ కేతన్ వెళ్లి పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. పర్యటన సందర్భంగా గణబాబు ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. కాలనీ అంతటా నీరు నిలిచి ఉన్న ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, జీవీఎంసీ మరియు రెవెన్యూ అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

"వర్షం కారణంగా ప్రజలు ఇబ్బంది పడకూడదు. నీటి మునిగిన ప్రాంతాల నుండి నీరు తొందరగా బయటకు వెళ్లేలా పంపులు ఏర్పాటు చేయాలని, డ్రైనేజ్ వ్యవస్థను తక్షణమే శుభ్రపరచాలని అధికారులకు ఆదేశించాం," అని గణబాబు తెలిపారు. అదేవిధంగా, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఏకేసి కాలనీకి తగిన అవుట్‌ఫ్లో డ్రైనేజ్ లైన్లు, రోడ్ల ఎత్తు, నీరు వెళ్లే మార్గాలను శాస్త్రీయంగా పునర్నిర్మించడానికి ఇంజనీరింగ్ విభాగం చర్యలు చేపడుతుందని గణబాబు పేర్కొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించడానికి మా బృందాలు పనిచేస్తున్నాయి. నీటిని పంప్‌ల ద్వారా బయటకు తరలించడం జరుగుతోంది. అవసరమైతే అదనపు సిబ్బందిని కూడా మోహరించనున్నాం," అన్నారు. కాలనీలోని ప్రజలు గణబాబుకి తమ కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రతి వర్షకాలంలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని కోరారు. చివరగా గణబాబు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించడం మా బాధ్యత. ప్రభుత్వం, జీవీఎంసీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి మల్కాపురం ప్రాంతాన్ని పూర్తిగా సురక్షితంగా ఉంచుతాం," అని హామీ ఇచ్చారు.

# కొత్తపాలెం చుట్టుప్రక్కల ప్రాంతాలు జలమయం

- లోతట్టు ప్రాంతాలను పర్యటించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు
- సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు





**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 28 :** మొంథా తుఫాన్ ప్రభావంతో గోపాలపట్నం మండలం పరిధిలోని 89వ వార్డ్ కొత్తపాలెం చివర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో భారీగా నీరు విడుదల కావడం వల్ల వరదనీరు కొత్తపాలెం%–%నరవ ప్రధాన రహదారి మీదికి చేరి రహదారి పూర్తిగా జలమయం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు స్వయంగా ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. నీటి మళ్లింపు చర్యలను తక్షణమే చేపట్టి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

తుపాన్ ప్రభావంతో స్థాన చలితులైన ప్రజల కోసం ఏర్పాటు చేసిన 19 సహాయక పూరణవాస శిబిరాలను కూడా గణబాబు సందర్శించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్, శుభ్రత తదితర విషయాలపై సమాచారం తీసుకున్నారు. ఏ బాధితుడికీ ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, గోపాలపట్నం మండలం స్పెషల్ ఆఫీసర్ మాధవి, జోనల్ కమిషనర్ శంకరరావు, కూటమి నేతలు, జీవీఎంసీ సిబ్బంది మరియు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని కూడా నియమించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన ప్రజలను ధైర్యంగా ఉండమని కోరుతూ, ప్రభుత్వం వారి పక్కనే ఉందని భరోసా ఇచ్చారు.

# మొంథా తుఫాన్ ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది

చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి

ఎంపీడీవో సిహెచ్ సీతామాలక్ష్మి

**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 28:-** చింతపల్లి మండలంలో తుఫాన్ ప్రభావం పై అత్యవసర సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నారని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి ఎంపీడీవో సిహెచ్ సీతామాలక్ష్మి, అన్నారు మంగళవారం స్థానిక ఎంపీపీ అనూష దేవి, తాహసిల్దార్ కె శంకరరావు తో కలిసి తాజంగి జలాశయం బలబద్రం తాజంగి సోమవారం బ్రిడ్జిలు పరిశీలించారు ఈ సందర్భంగా ఎంపీడీవో సీతామహా లక్ష్మి మాట్లాడుతూ మొంథ తుఫాన్ ప్రభావం వలన బుధవారం రాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది అన్నారు గ్రామాలలో గ్రామ సచివాలయం ఉద్యోగులు కార్యదర్శులు వీఆర్వోలు తుఫానుపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యవంతులు వేశామన్నారు ప్రస్తుతం గ్రామాల్లో విఆర్వోలు కార్యదర్శులు గ్రామ సచివాలయం ఉద్యోగులు పీహెచ్ సి వైద్యాధికారులు వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉన్నారు లంబసింగ్ ఘాటీలో భారీ వాహనాలు రాకపోకలు పోలీస్ అధికారులు నిలిపివేశారు ఘాటీలో వృక్షాలు బండరాళ్లు పడి రాకపోకలకు అంతరాయం కలిగితే వెంటనే తొలగించేందుకు ఆర్ అండ్ బి అధికారులు లంబసింగి జంక్షన్ తురపాడ గెడ్డ దగ్గర సిబ్బందిని సిద్ధంగా ఉంచామన్నారు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సైతం కుదించడం జరిగింది అన్నారు తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలు ప్రయాణాలు చేయరాదన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎంఐ ఏఈఈ లోకేష్ ఆర్ అండ్ బి ఏ ఈ ఈ జయరాజు పాల్గొన్నారు



# మొంథా" తుఫాన్‌పై సింహాచలం దేవస్థానం సర్వసన్నద్ధం





## భక్తుల రక్షణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్న ఈవో

**సింహాచలం, పెన్ పవర్, అక్టోబర్ 28 :** విశాఖపట్నం తీరాన్ని ముప్పుగా తాకుతున్న "మొంథా" తుఫాన్ దృష్ట్యా, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం పూర్తిగా అప్రమత్తమైంది. భక్తుల రక్షణ, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, దేవస్థానం అధికారులు అన్ని విభాగాల్లో ముందస్తు చర్యలు చేపట్టారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎన్.సుజాత స్వయంగా కొండపైన, కొండ దిగువన ఉన్న వివిధ విభాగాలను పరిశీలించి, తుఫాన్ ప్రభావాన్ని అంచనా వేసి సిబ్బందికి భద్రతా సూచనలు అందించారు.

"భక్తుల సురక్షణే దేవస్థానం ప్రధాన ధ్యేయం. తుఫాన్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో, వేగవంతంగా పనిచేయాలని ఈఓ తెలిపారు.

దేవస్థానం చేపట్టిన ముఖ్య భద్రతా చర్యలు..

ఘాట్ రోడ్లలో ప్రత్యేక పర్యవేక్షణ, వాహన రాకపోకల నియంత్రణ, వర్షపు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను వెంటనే శుభ్రపరచే చర్యలు ప్రారంభం. విద్యుత్ సదుపాయాల తనిఖీ, విద్యుత్ స్తంభాలు, తీగలు, లైటింగ్ వ్యవస్థలను సురక్షితంగా ఉంచే ప్రయత్నంబీ ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు. ఆలయ పరిశుభ్రత, ఆలయ భవనాలు, గోపురాలు, ప్రాకారాలు, అన్నదానం శాల, ప్రసాద కౌంటర్లు, త్రాగునీటి ట్యాంకులు అన్ని ప్రదేశాలు శుభ్రంగా ఉంచడం. డ్రైనేజీ వ్యవస్థ పర్యవేక్షణ, వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ లైన్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిరంతర తనిఖీ. చెట్ల భద్రతా చర్యలు, తుఫాన్ సమయంలో విరిగిపడే అవకాశం ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించడం. అత్యవసర సేవలు సిద్ధం, భక్తులను అవసరమైతే సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు ప్రత్యేక సిబ్బంది, వాహనాలు సిద్ధంగా ఉంచడం.

దేవస్థానం అధికారులు భక్తులకు విజ్ఞప్తి చేస్తూ, "తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు దేవస్థానం మార్గదర్శకాలను పాటించి సహకరించండి. మీ భద్రత మా మొదటి కర్తవ్యమని," ఈఓ ఎన్. సుజాత తెలిపారు.

ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే ఈ క్రింది ఫోన్ నెంబర్లను : 0891%-%2954944, 9398734612 సంప్రదించాలని ఈవో తెలిపారు.

# పీకే.గూడెం సచివాలయం ను సందర్శించిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడయ్య.....



**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 28):** మంగళవారం మండలంలో గల పీకే గూడెం సచివాలయాన్ని రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయసిబ్బంది మొంథా తుఫాను నుండి ప్రాణ నష్టం,ఆస్తి నష్టం జరగకుండా  ప్రజలకు సేవ చేయడానికి అందుబాటులో ఉన్నారని తెలిపారు. అత్యవసర వైద్య సేవలు కొరకు ఎం.ఎల్ హెచ్ పి,వైద్య సిబ్బంది కూడా సచివాలయంలో అందుబాటులో ఉన్నారని,తుఫాన్ ప్రభావం అధికమైతే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన తెలియజేశారు. అలాగే గెడ్డలు,వాగుల్లో అడ్డంగా ఏమైన బలమైన దుంగలు, ఇతర చెత్త అడ్డం పడితే వాటిని తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది అన్ని ఇబ్బందులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాట్ల ఆయన చెప్పారు. వీఆర్వోలు గ్రామం చుట్టూ తిరిగి పరిస్థితులు గమనిస్తున్నారని, కార్యదర్శి,పశు సంవర్ధక సహాయకులు ఎవరి సేవలు వారు అందిస్తున్నారని ఆయన తెలియజేశారు.

# మెఘాద్రిగడ్డ రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుదల



- ముందు జాగ్రత్త చర్యగా నాలుగు గేట్లు ఎత్తివేత
- లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచన

**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 28 :** గత రెండు రోజులుగా విశాఖపట్నం నగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో మెఘాద్రిగడ్డ రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం గణనీయంగా పెరిగింది. వరద నీరు అధికంగా వచ్చిపడటంతో రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయికి చేరువ కావడంతో, అధికారులు మంగళవారం జాగ్రత్త చర్యగా నాలుగు గేట్లను ఎత్తివేశారు. ఈ చర్యతో రిజర్వాయర్ దిగువ ప్రాంతాలకు పెద్ద ఎత్తున నీరు విడుదల అవుతోంది. ఫలితంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నీటిపారుదల శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక మున్సిపల్ మరియు విపత్తు నిర్వహణ సిబ్బంది సిద్ధంగా ఉండాలని కూడా సూచించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో సుమారు 5,500 క్యూసెక్కుల నీరు నిల్వగా ఉండగా, దీని పూర్తిస్థాయి సామర్థ్యం 6,600 క్యూసెక్కులు అని అధికారులు తెలిపారు. నీటి మట్టం మరింతగా పెరగకుండా ముందస్తు చర్యగా గేట్లు ఎత్తివేయడం జరిగిందని వివరించారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో, రాబోయే గంటల్లో రిజర్వాయర్‌లోకి ఇంకా మరింత నీరు చేరే అవకాశం ఉందని అంచనా. దీనిని దృష్టిలో ఉంచుకొని నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవసరమైతే మరిన్ని గేట్లు ఎత్తివేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. మరోవైపు, మెఘాద్రిగడ్డ రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు తగిన జాగ్రత్తలు పాటించాలనే సూచనలు ఇవ్వబడ్డాయి. వర్షం తీవ్రత తగ్గేవరకు రిజర్వాయర్ సమీప ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మెఘాద్రిగడ్డ రిజర్వాయర్ విశాఖ నగరానికి ముఖ్యమైన తాగునీటి వనరుల్లో ఒకటి, ఈ వర్షాలతో నీటి నిల్వలు పెరగడం నగరానికి శు భసూచకమే అయినప్పటికీ, లోతట్టు ప్రాంతాల భద్రత కోసం అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# గున్నలంక బావి నుండి జనరేటర్ తో మంచి నీరు పంపింగ్



- కరెంటు లేక,జనరేటర్ సహాయంతో వాటర్ ట్యాంకులకు పంపింగ్
- టి డి పి నాయకులు రీమల ఆనంద్
- లక్కోజు నాగభూషణం

**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 28:**-మొంథా తుఫాన్ ప్రభావంతో చింతపల్లి మేజర్ పంచాయతీ లో విద్యుత్తు లేకపోవడంతో , గున్న లంక మంచినీటి బావి నుండి తాగునీరు కోసం జనరేటర్ ఏర్పాటు చేసి గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకులకు మంచి నీరు పంపింగ్ చేశామని తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు లక్కోజు నాగభూషణం తెలిపారు, జనరేటర్ సహాయంతో బావి నుండి వాటర్ పంప్ చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నామని తెలిపారు

# సుత్తిగూడలో మొంథా తుఫాన్ తో నేలకొరిగిన భారీ వృక్షం

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- లక్ష్మీపురం పంచాయతి సర్పంచ్ కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో చెట్లు తొలగింపు.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 28.** మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో గల మారుమూల లక్ష్మీపురం పంచాయితి, సుత్తిగూడ గ్రామంలో భారీ వృక్షం నేలకొరిగాయి. లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు కెళ్ళే ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరయం ఏర్పడింది. భారీ మామిడి చెట్టు నేలకొరిగిన విషయాన్ని తెలుసుకున్న పంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్ హుటాహుటిన సంఘటన స్థలంలో చేరుకొని గ్రామస్తులతో కలిసి వృక్షాన్ని తొలగించారు. దీంతో రాకపోకల అంతరాయనికి తెరపడింది. భారీ వృక్షం నేలకొరిగిన సమయంలో సరిహద్దులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సంఘటనలు ఎదురైన తమకు తెలియజేయాలని సర్పంచ్ త్రినాధ్ ప్రజలతో అన్నారు.

# 65వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో పర్యటించిన పల్లా





**గాజువాక పెన్ పవర్, అక్టోబర్ 28** తుపాన్ ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన 65 వార్డ్ రోబ్ కొండవాలు ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ,వార్డ్ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు, వార్డ్ అధ్యక్షుడు రట్టి వాసు,వార్డు ఉపాధ్యక్షుడు పాటిబండ్ల శివ శాస్త్రి, సీనియర్ నాయకుడు నక్క భాస్కర్,వార్డు తెదేపా నాయకులు మరియు అధికార యంత్రాంగం కలిసి వాంబే కాలనీ సంజీవగిరి కాలనీ పర్యటించారు.

# మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మండలంలో ఏమైనా ప్రమాదాలు జరిగితే 9440904233 నెంబర్ కు కాల్ చేయండి.
- ముంచంగిపుట్టు ఎస్సై జే రామకృష్ణ.



మొంథా తుఫాన్ నేపథ్యంలో మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే 9440904233 నెంబర్ కు కాల్ చేయాలని ముంచంగిపుట్టు ఎస్సై జే రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పాడుబడిన మట్టి ఇల్లు లో ఉండరాదని, దగ్గరలో రిలీఫ్ సెంటర్ లో అన్ని సదుపాయాలు కల్పించ బడుతుందన్నారు. మత్స్యకారులు చేపలు వేటకు వెళ్ళరాదని, గెడ్డలు, వాగులు దాటి ప్రయాణాలు చేయరాదన్నారు. ఘాట్ రోడ్ లో ప్రయాణాలు సురక్షితం కాదని, కొండ వాలు గ్రామాలకు ఉన్నవారు అప్రమత్తం గా ఉండవలన్నారు. కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉంది గనుక ప్రజలు అలాంటి పరిస్థితి ఉన్నట్లయితే ముందుగా అధికారులు కి తెలియజేస్తే గ్రామాలలో పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే పోలీస్ స్టేషన్ కి వెంటనే సమాచారం అందించాలని ప్రజా ప్రతినిధులకు, పాత్రికేయులకు ఆయన కోరారు.

# నాణ్యత ప్రమాణాలు పాటించండి...!

- పంచాయితీ భవన నిర్మాణాల పర్యవేక్షణ చేసిన మండల ఇంజనీరింగ్ జేఈ



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్28 :** మండలంలోని నాలుగు పంచాయితీ భవనాలను పరిశీలించిన మండల ఇంజనీరింగ్ జేఈ రామకృష్ణ. మండలంలోని నిర్మాణంలోనున్న చింతలపూడి 32 లక్షల నిధులతో నిర్మాణంలోనున్న పంచాయితీ భవనం , కినపర్తి, బట్ట పనుకుల, బంగారంపేట పంచాయతీల్లో నిర్మాణంలోనున్న పంచాయతీ భవన నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆయన ఆదేశించారు. అలాగే పంచాయతీ భవనాలను నాణ్యత ప్రమాణాలతో నిర్మించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

# "మొంథా తుఫాన్" నేపథ్యంలో సహాయక కార్యక్రమాలకు జన సైనికులు సిద్ధంగా ఉండాలి:

జనసేన నేత గొర్లె వీర వెంకట్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 28:** "మొంథా తుఫాన్" నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీర వెంకట్ ప్రజలకు సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప ఎవరూ బయటకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో లేదా పాడుబడిన ఇండ్లు, పాకల వద్ద ఉండరాదని ప్రజలను హెచ్చరించారు. అదేవిధంగా వాగులు, గెడ్డలు దాటే ప్రయత్నం చేయకుండా సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ సహాయక చర్యలు చేపట్టే సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే, జనసేన కార్యకర్తలు స్వచ్ఛందంగా సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు జనసైనికులు సిద్ధంగా ఉండాలని వీర వెంకట్ తెలిపారు. ప్రజల భద్రతే ప్రాధాన్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# తుఫాను ధాటికి నేలకొరిగిన కొబ్బరిచెట్లు,





**స్తంభించిన జనజీవనం.అంధకారం లో గ్రామాలు.**

**అధికార్ల పర్యవేక్షణ పునరుద్ధరణ.**

**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 28 :**డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం లో గ్రామాల్లో మంగళవారం తుఫాను ప్రభావం తో జనజీవనం స్తంభించింది.భారీ ఈదురుగాలులకు కొబ్బరి చెట్లు చిగురాకులులా తిరిగి విరిగాయిమాచర గ్రామ సొసైటీ వద్ద , టేకి కోరుమిల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారి మార్గం పై కొబ్బరి చెట్లు గాలులకు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి.జిల్లాఉన్నత అధికార్లు ఆదేశానుసార ంరెవిన్యూ,పంచాయతీ, ట్రాన్కోవైద్య ఆరోగ్య ,తదితర మండల స్థాయి,గ్రామ స్థాయిలో ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో తుఫాను బాధిత కుటుంబాల వారిని ప్రభుత్వ పాఠశాలలో తరలించి, పునరావాసం ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులుశ్రేణులు శిధిల భవనాలు, పూరి గుడిసెలు లో నివసిస్తున్న కుటుంబాల్ని గుర్తించి,ప్రభుత్వ పాఠశాలలకు తరలిస్తున్నారు. ముంతా తుఫాన్ ప్రభావం తగ్గేవరకు బాధిత కుటుంబాలకు పునరావాస శిబిరాలు లోనే రాత్రి, పగలు బోజన వసతి,త్రాగునీరు,వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు రెవిన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, వైద్య ఆరోగ్య , ట్రాన్స్ తదితర శాఖల అధికారులు మంగళవారం మీడియా కు తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకు బయటకు వెళ్లడం శ్రేయస్కరం కాదని, సురక్షిత భవనాల లోనే తలదాచుకోవాలని జయ బాబు విజ్ఞప్తి చేశారు. ప్రతీ పునరావాస కేంద్రం వద్ద మెడికల్ శిబిరాలు నిర్వహిస్తున్నారు. టేకి గ్రామం జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాల లో ఏర్పాటు చేసిన తుఫాన్ బాధితుల శిబిరాన్ని మండపేట నియోజక నాయకులు వివిధ శాఖల ఉద్యోగ సిబ్బంది పరామర్శించి సదుపాయాలు,అవసరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

## లూభర్తీ జలాశయం పటిష్టం...!

**లూభర్తీ జలాశయాన్ని పరిశీలించిన జేఈ రామకృష్ణ:**




**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 28**

మండలంలోనిలూభర్తీ జలాశయం మొ%శీ%థా తుఫాన్ ప్రభావంతో ఎటువంటి డ్యామేజ్ జరగలేదని మండల ఇంజనీరింగ్ జేఈ రామకృష్ణ తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం జలాశయాన్ని, అలాగే మండలంలో ఉన్న పలు గ్రామాలను సందర్శించి పర్యవేక్షించారు. రహదారులకు అడ్డంగా వృక్షాలు నేలకొరిగిన అందుబాటులో జెసిబి కట్టర్లు అందుబాటులోఉన్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## ప్రజల భద్రతే ప్రధమ కర్తవ్యం - పల్లా శ్రీనివాసరావు







**గాజువాక:పెన్ పవర్, అక్టోబర్ 28**

మొంథా తుఫాన్ ముంచుకోస్తున్న తరుణంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాక లో గల లోతట్టు పలు ప్రాంతాలు, యారాడ తీర ప్రాంతంలో, మరియు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి బాధితులను పరామర్శించారు. పరిశీలించిన ప్రాంతాల్లో సమస్యలు తెలుసుకొని, స్థానికంగా ఉన్న ప్రజలకు సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

గాజువాక జోనల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా, సమావేశం నిర్వహించి, నియోజకవర్గ ప్రజలు మెంథా తుఫాను ద్వారా ఎటువంటి ఇబ్బందులు ఎదురుకోకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ తుఫాన్ ఉగ్రరూపం దాల్చబోతున్నందున, రాబోయే 24 గంటలు అత్యంత కీలకమైనవిగా మారాయని. తీరప్రాంతాల్లో బలమైన గాలులు, భారీ వర్షాలు విస్తరించే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, అవసరం లేని బయటకు వెళ్లడాన్ని నివారించాలని కోరారు. ఇలాంటి సమయంలో రాజకీయాలు పక్కన పెట్టి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అధికారులు నాయకులు ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రెడ్డి, గాజువాక జోనల్ కమిషనర్ బి ఆర్ ఎస్ శేషాద్రి, సౌత్ ఏసిపి శ్రీనివాస్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శానిటేషన్ పనులను పర్యవేక్షించిన ఎంపీడీవో



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండల కేంద్రంలో శానిటేషన్ పనులను ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు పరిశీలించారు. ఈ తుఫాన్ నేపథ్యంలో మురుగునీరు ఎక్కడ నిలబడి ఉండకుండా చర్యలు చేపట్టాలని శానిటేషన్ పనులను సక్రమంగా నిర్వహించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, డిప్యూటీ ఎంపీడీవో కిట్లంగి బాలకృష్ణ పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన ప్రభుత్వ విప్.





**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 28 పెన్ పవర్.**మొంథా తుఫాన్ నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ %�льд% కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం తాసిల్దార్ కార్యాలయము లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను మంగళవారం నాడు స్వయంగా ఆమె పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తలపై అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.మొంథా తుఫాన్ వలన ఈరోజు,రేపు బలమైన గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించరని, తుఫాన్ నేపథ్యంలో కురుపాం మండలంలోని లేవిడి,గుంజరాడ,బొడ్డమానుగూడ గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను,కొండవాగులను పరిశీలించారు.బొడ్డమానుగూడ లో పూరి గుడిసెలో ఉన్న కుటుంబాలను సురక్షితమైన ఇళ్లలో ఆశ్రయించాలని ఆమె సూచించారు.జి.శివడ కూడలిలో వరి నూర్పు చేస్తున్న రైతులతో మాట్లాడి తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తొందరగా మీ పనులు ముగించుకొని ఇళ్లకు చేరాలని అన్నారు.అక్కడ ఉన్న చెరువును పరిశీలించి రెవెన్యూ అధికారులు అప్రమత్తం ఉండాలని ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణం నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని,ప్రజలు సురక్షితంగా ఉండేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఎమ్మెల్యే గారి వెంట స్పెషల్ ఆఫీసర్ ధర్మచంద్రారెడ్డి, బిజెపి జిల్లా ఎస్టి మోర్చా అధ్యక్షులు నిమ్మక సింహాచలం.మండల పార్టీ అధ్యక్షులు కేవీ కొండయ్య,మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్,మాజీ ఎంపిటిసి మండంగి ప్రసాద్ రావు,రాజేష్, మన్మధ,తిరుపతి, రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రజలకు అండగా వుంటాం -నల్లూరు సూర్యనారాయణ



**గాజువాక:పెన్ పవర్, అక్టోబర్ 28:**మొంథ తుఫాన్ కారణంగా గాజువాక 86వ వార్డు రాసాలమ్మ కాలనీలో లోతట్టు ప్రాంతంలో వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వార్డులో తుఫాను ప్రభావ ప్రాంతాలలో పర్యటించమని అన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలను కలుసుకొని వారి సమస్యలు తెలుసుకుని అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించే దిశగా పనులు జరుగుతున్నట్లు తెలిపారు.ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన వార్డు నాయకులు అండగా ఉంటామని హామీయిచ్చారు. పర్యటనలో వార్డు క్లస్టర్ ఇంచార్జి వేగుంట శ్రీనివాస్, కార్యదర్శి జగదీష్, ఉపాధ్యక్షుడు రమేష్,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గణపతి, బీసీ సెల్ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, నాయకులు సింహాద్రి, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల ముంపు పరిస్థితులపై అధికారులు పరిశీలన





**ప్రజలకు అప్రమత్తత సూచనలు**

**పద్మనాభం,పెన్ పవర్, అక్టోబర్ 28 :**పద్మనాభ మండల పరిధిలో వరి పంట పొలాలు నీటమునిగిన పరిస్థితులపై అధికారులు మంగ ళవారం పరిశీలన చేపట్టారు. మండలంలోని బి.బి.జి లేఔటు సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో పంటలకు నష్టం సంభవించే అవకాశం ఉందని గుర్తించా రు.మండల ప్రత్యేక అధికారి జ్ఞానవేణి సంద ర్శించి పరిస్థితిని సమీక్షించారు. రైతులతో మా ట్లాడిన ఆమె, వర్షాలు కొనసాగుతున్నం దున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రాణ హానీ పరిస్థితులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కె. ఆనందరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి. శ్యా మల, వి.ఆర్వో.లు, గ్రామ పెద్దలు మరియు అధికార సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి తగిన చర్యలు తీసుకునేందుకు సూచనలు ఇచ్చారు.

# గడ్డిబందలో రేకుల షెడ్డు నిర్మించీ పాఠశాల కొనసాగించాలి

- తాత్కాలి రేకుల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీడీవోకు వినతి.
- గ్రామంలో పాఠశాలలేక విద్యార్థులు మూడు కిలోమీటర్లు నడిచే పరిస్థితి ఉండేది.
- వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 28.** మండలంలో గల కించాయిపుట్టు పంచాయితీ గడ్డిబంద గ్రామంలో తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మించి పాఠశాలను కొనసాగించాలని, రేకుల షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే ధర్మరావుకు వినతి పత్రాన్ని సమర్పించినట్లు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు పాటుబోయి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గడ్డి బందలో పాఠశాల లేక 13 మంది విద్యార్థులు గ్రామ సమీపంలో గల రాములు గ్రామంలో సుమారు మూడు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లే వారన్నారు. అయితే ప్రస్తుతం గడ్డిబందలోనే పాఠశాల నిర్వహిస్తూన్న నేపథ్యంలో విద్యను పిల్లలు అభ్యసిస్తున్నారు అన్నారు. పాఠశాల నిర్వహణకు తాత్కాలికంగా షెడ్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని, వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీడీవోకు వినతి పత్రాలు సమర్పించినట్లు వైస్ ఎంపీపీ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సొలగాం గాసిరం దొర, నరసింగరావు పడాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఈదులబంద గ్రామంలో శిథిలమైన నివాస గృహాలను పరిశీలించిన అధికారులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం రింతాడా పంచాయతీ ఈదులు బంధ గ్రామంలో తుఫాన్ ప్రభావం కారణంగా శిథిలమైన నివాస గృహాలను గురించి పీసా ఉపాధ్యక్షులు కోటి బాబు మరియు కూటమి నాయకులు పాండురాజు పంచాయతీ అధికారులకు సమాచారం అందించటంతో పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, గ్రామ రెవిన్యూ అధికారి కృష్ణారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వీర నవీన్, మరియు ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ గ్రామాన్ని సందర్శించి గృహాలను పరిశీలించారు. ప్రజలను తుఫాన్ ప్రభావం పూర్తిగా ముగియేవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిథిలమైన గృహాల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని గృహస్తులు తుఫాన్ దృశ్య అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు గ్రామంలో నష్టపరిహార చర్యలు అవసరమైతే, వెంటనే చర్యలు చేపట్టేలా నిర్ణయం తీసుకోవాలని బాధితులు కోరారు.

# సీలేరు దుప్పుల వాడ సచివాలయాలను సందర్శించిన ఎంపీపీ

ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచన





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి ఎంపీపీ బోయిన కుమారి మంగళవారం సీలేరు మరియు దుప్పుల వాడ సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ దృశ్య సచివాలయం సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. సహాయక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుప్పుల వాడ సర్పంచ్ కేలేబు కుమారి, సీలేరు సర్పంచ్ పాంగి దుర్జో, వైసిపి నాయకులు వి.చంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.

బిజెపి జిల్లా ఎస్టి మోర్చా అధ్యక్షులు నిమ్మక సింహాచలం.



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 28 పెన్ పవర్.** మొంథా తుఫాన్ నేపథ్యంలో దుడ్డుఖలు పంచాయతీ సచివాలయం లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన కూటమి నాయకుడు బిజెపి జిల్లాఎస్టీ మోర్చా అధ్యక్షులు నిమ్మక సింహాచలం.ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి ఆయన సిబ్బందికు అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ. తుఫాన్ నేపథ్యంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామాల్లోకి వెళ్లి పరిశీలించి పజలకు అవగాహనా కలిపించాలి, ఎటువంటి ప్రాణనష్టం,ఆస్తి నష్టం జరగకుండా చూడాలి అత్యవసర పరిస్థితి లోనే బయటకు రావాలని లేనియెడల సురక్షితమైన ప్రదేశంలోని మాత్రమే ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలి అన్నారు తుఫాన్ వల్ల గ్రామాల్లో ఎటువంటి ఇబ్బంది కలిగిన తక్షణమే సచివాల సిబ్బందికు తెలియజేయాలని,ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రతి సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేయాలని సింహాచలం సిబ్బందికు సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బికల్ పంచాయతీ సర్పంచ్ నిమ్మక లీలావతి. పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ.వీఆర్వో హరికృష్ణ.మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

# తోకరాయి గ్రామస్తుల తరలింపు






**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 29:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ పంచాయతీ తోకరాయి గ్రామంలో తుఫాన్ ప్రభావం కారణంగా గ్రామస్తులను భద్రతా స్థలాలకు తరలించడం ప్రారంభమైంది. గత సంవత్సరం తుఫాన్ కారణంగా తోకరాయి గ్రామస్తులు వరదల వల్ల నష్టపోయారని పరిగణలోకి తీసుకుని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్య చేపట్టబడింది.ఈ సందర్భంలో సీలేరు ఎస్సై ఎం.డి. యాసిన్ దారకొండ గవర్నమెంట్ ఆశ్రమ పాఠశాల వద్దకు గ్రామస్తులను భద్రతతో తరలించారు.తుఫాన్ ముగియేవరకు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎండి.యాసిన్ సూచించారు.

# మొంథా తుఫాన్ సహాయక చర్యలకు మన్య ప్రగతి చారిటాబుల్ ట్రస్ట్ సిద్ధం

ముంచంగిపుట్టు ట్రస్ట్ ప్రతినిధులు పులి రాజు, దాసు, బాలు, సింహాచలం.

మన్యప్రగతి చారిటబుల్ ట్రస్ట్

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 28.** మొంథా తుఫాన్ ప్రభావిత ప్రజలు గర్భిణీ స్త్రీలు, వికలాంగులు, వృద్ధులు, మొంథా తుపాన్ కారణముగా ఎలాంటి అత్యవసర సహాయక చర్యలు కావాలన్నా వెంటనే మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ బృందానికి సమాచారం అందించి ట్రస్టు సేవలు పొందాలని ట్రస్ట్ ముంచంగిపుట్టు ప్రతినిధులు పులిరాజు, దాసు, బాలు, సింహాచలం తెలిపారు. తుఫాను ప్రభావంతో బలమైన గాలులు వీస్తాయని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రమాదాలు జరిగినప్పుడు సహాయక చర్యలు చేపట్టడం గిరిజన మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ బృందం సిద్ధంగా ఉందన్నారు. తుఫాను విపత్కార సమయంలో 6305234959, 9491600302, 6303843208, 9493426909 అనే నంబర్లకు కాల్ చేసి సంప్రదించాలని వారు కోరారు.

# భారీ వర్షాలకు ఇళ్లలోకి ప్రవేశించిన భారీ కొండచిలువ

- ఫిర్యాదు చేసినా స్పందించి పట్టించుకోని అటవీ శాఖ సిబ్బంది
- కొండచిలువను పట్టుకుని సమీప కొండలలోకి వదిలి పెట్టిన స్థానికులు





**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 28:** భారీ వర్షాల కారణంగా కొండలపై నుండి నివాసాల మధ్యకు వచ్చిన భారీ కొండచిలువ. జీవీఎంసీ జోన్ 2 పరిధి 11 వ వార్డు క్రాంతి నగర్ లో మొంథా తుఫాన్ భారీ వర్షాలు ధాటికి సమీప కొండవాలు ప్రాంతాల నుండి భారీ కొండచిలువను నివాసాల మధ్య కాలువలో స్థానిక ప్రజలు గుర్తించారు.వెంటనే స్థానికులు ఫారెస్ట్ అధికారులకు విషయం క్రాంతి నగర్ అధ్యక్షులు నేదురు సత్యనారాయణ తెలియజేశారు.అటవీ సిబ్బంది వచ్చి కొండచిలువ కాలువలో నుండి బయటికి రాకపోవడంతో సిబ్బంది అక్కడి నుండి వెళ్లిపోయారు. తరువాత స్థానికులు షేక్ మదీనా.నందిగ అప్పల రెడ్డి . జీవీఎంసీ మలేరియా సిబ్బంది కనకల.అశ్విని కుమార్. సుధాకర్. అక్కిరెడ్డి గురునాథ్ కుంచా ప్రవీణ్ కుమార్ లు కొండచిలువను పట్టుకొని. ముడసర్లోవ వెనుక ఉన్న కొండలలో దానిని విడిచిపెట్టారు.క్రాంతి నగర్ కొండవాలు ప్రాంతం లో ఉండుటవలన కొండలపై నుండి జింకలు పాములు సాంబార్ ఇతర జంతువులు నివాసాలు మధ్యకు వస్తున్నాయని,క్రాంతి నగర్ అటవీ శాఖ ప్రాంతానికి సంబంధించి రక్షణ కూడా నిర్మించాలని తద్వారా వన్యప్రాణులకు రక్షణ ఉంటుందని విష సర్పాలు లేదా ఇతర జంతువులు నివాసాల మధ్యకు రావడం జరగదని వాటిని రక్షణకై రక్షణ గోడ నిర్మించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

# మొంథా తుఫాన్ దృష్ట్యా గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తరలింపు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 29:** అల్లూరి జిల్లా జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రాపల్లి మరియు దారకొండ పంచాయితీ తోకరాయి గ్రామస్తులను మొంథా తుఫాన్ ప్రభావం వల్ల భద్రతా కారణాల కోసం పునరావాస కేంద్రాలకు తరలించడం ప్రారంభమైంది. ఈ చర్యలను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు చేపట్టారు.చట్రాపల్లి గ్రామస్తులు సప్పర్ల ప్రభుత్వ పాఠశాలలో, తోకరాయి గ్రామస్తులు దారకొండ ఆశ్రమ పాఠశాలలో భద్రతా వసతుల కోసం తరలించబడ్డారు. పునరావాస కేంద్రాల్లో వారికి అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, రెవిన్యూ అధికారులు మరియు పోలీసులు సమన్వయంతో అందిస్తున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ 8న జలప్రళయం కారణంగా చట్రాపల్లి గ్రామంలో ఒకరు మృతి చెందగా, కొందరు గాయపడ్డారు. తోకరాయి గ్రామంలో కొండచరియలు, మాదిమళ్ళ కాలువ ద్వారా ప్రవహించి ఇళ్లకు, పంటలకు నష్టం కలిగించాయి.అందువల్ల, ప్రజల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం నివారించడానికి అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ తరలింపును చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిటి దుమంతి సత్యనారాయణ, జీకే వీధి ఎస్ఐ సురేష్, గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు, దారకొండ వీఆర్వో ముర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు జారిన కొండ







- 12 వ వార్డు బి సి కాలనీ ప్రమాదపు అంచులలో నివాసాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వా అధికారులు నాయకులు

**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 28:** జీవీఎంసీ జోన్ 2 పరిధి 12 వ వార్డు, బి సి కాలనీలో భారీ వర్షాలకు కొండ ప్రాంతం లో జారిన కొండ తప్పిన ప్రమాదం సమీప ఇళ్ళ పై పడిన రాళ్లు మట్టి బురద.తుపాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండపై భాగంలో గల రహదారి రైలింగ్ యుజిడి పైప్ లైన్లు క్రిందకి జారింది. ఇది గమనించిన సమీప ప్రాంతం నివాసులు ప్రభుత్వమై ఇళ్ల నుండి బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను తోట గరువు ఉన్నత పాఠశాల లో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాలకు వారిని తరలించారు స్పందించిన అధికారులు విని వెంటనే ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి కొండ వాలు ప్రాంతం జారిపోకుండా పటిష్టమైన ఏర్పాట్లను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.శాసన సభ్యులు, వెలగపూడి రామకృష్ణ బాబు. జీవీఎంసీ అధికారులు కలసి పర్యటించి,బాధితులను ఆదుకోవాలని వారికి ఆహారం ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులు ఆదేశించారు.జోనల్ కమీషనర్, కనక మహాలక్ష్మి. చిన్నగదిలి తహసీల్దార్ పాల్ కిరణ్, ఏసిపి శాస్త్రి, డి ఇ వెంకటరావు, జీవీఎంసీ,రెవున్యూ, సచివాలయ సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకర ప్రదేశాలను పరిశీలించిన పోలీస్ రెవెన్యూ సిబ్బంది









**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 28:**తుఫాన్ నేపథ్యంలో మండలంలోని పలు ప్రమాదకరమైన ప్రదేశాలను తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై వెంకటేష్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు పరిశీలించారు. మండలంలోని సూరంపాలెం రిజర్వాయర్ వద్ద పోలీస్ రెవెన్యూ సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. ప్రాజెక్ట్ పరిసరాల్లోకి ఎవరిని వెళ్ళనివ్వకుండా పహారా కాస్తున్నారు. అలాగే నెల్లిపూడి గ్రామ శివారులో గల కల్వర్టు వద్ద పాత రామవరం చెరువు వద్ద వేము లోవ తదితర ప్రాంతాల్లో గల ప్రమాదకర ప్రదేశాలను వారు పరిశీలించి ఆ ప్రదేశాల్లో నియమించిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొండ వాగులు చెరువులు ప్రాజెక్టు వద్ద చేపల వేట చేపట్టవద్దని అత్యవసరమైతేనే ఇళ్ల నుండి బయటికి రావాలని పలు గ్రామాల్లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటన.



**ఏలూరు అక్టోబర్ 28 పెన్ పవర్ :** ఏలూరు జిల్లాలోన తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటించారు. ఉదయం జోరువానలోనే కొల్లేరు బయలుదేరిన ఎంపీ, కైకలూరు సమీపంలో మాదేపల్లి గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడారు. కొల్లేరు సమీపంలో చెరువుల వద్ద ఆక్వా రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కైకలూరు నుంచి ఉప్పుటేరు బ్రిడ్జి వద్దకు చేరుకున్న ఎంపీ ఉప్పుటేరు నీటి ఉధృతిని పరిశీలించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఉండి ఎమ్మెల్యే, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తో కలిసి ఉప్పుటేరు ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీ పుట్టా మహేష్ మీడియాతో మాట్లాడారు. తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, ఎటువంటి ప్రాణ నష్టం జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు,నారా లోకేష్ నిరంతరం పరిస్థితులను సమీక్షిస్తున్నారని, ప్రజా ప్రతినిధులంతా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని ఎంపీ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఆహారం, అత్యవసర వైద్యం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం అక్కడినుంచి కైకలూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాసం పొందుతున్న వ్యక్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సాయంత్రం ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామంలో కూటమి పార్టీల కార్యకర్తలతో భేటీలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తుఫాను సహాయ చర్యల్లో పాల్గొనాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.అత్యవసరం అయితే ఏలూరు కలెక్టరేట్ వద్ద కంట్రోల్ రూమ్ నెంబర్ 1800-233-1077, 94910 41419 ఫోన్ నెంబర్ల లేదా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయ నంబర్స్ 91 96181 94377, 91 98855 19299 కు ఎవరైనా కాల్ చేయవచ్చని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన అధికార బృందం



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 28:**మొంథా తుఫాను ప్రభావంతో మండలంలో ఏర్పాటు చేసిన 22 పునరావాస కేంద్రాలను మంగళవారం అధికార బృందాలు పరిశీలించారు. ఎంపీడీవో ఏ రాజు ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మి ప్రత్యూష పునరావాస కేంద్రంలోని సదుపాయాలపై ఆరా తీశారు. బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న బాధితులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎక్కడి నుంచి తరలించారనే పూర్తి సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకం ద్వారా ఏర్పాటుచేసిన పౌష్టికాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 బి అప్పాజీ, ఎంఈఓ 2 ఎన్ రాజు, పంచాయతీ కార్యదర్శులు,రెవెన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎం,ఆశ, అంగన్వాడి సూపర్ వైజర్లు,వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.ద

## బూరుగుపూడి గ్రామలో గ్రామపంచాయతీ అధికారులు, సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండాలి..

జనసేన నాయకులు అడపా శ్రీనివాస్..






**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 28:** రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ ఆదేశాల మేరకు పంచాయతి సెక్రటరీని వీఆర్వోని సచివాలయం సిబ్బందిని మరియు మెడికల్ అధికారులతో అందరితో మీటై గ్రామ ప్రజలకు అందరికీ ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండాలని రాజానగరం జనసేన సీనియర్ నాయకుడు అడపా శ్రీనివాస్ అధికారులకు సూచించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడుడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యగా తుఫాన్ ప్రభావం వలన బూరుగుపూడి గ్రామంలో మట్టి ఇంటిలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి వారిని తుఫాన్ ప్రభావం తగ్గు వరకు దగ్గరలో గల రెండు మండల ప్రజా పరిషత్ స్కూల్ నందు నివాసం ఉండవలసినదిగా సూచించి దగ్గర ఉండి కొంతమందిని తరలించడం అయినది గ్రామ సచివాలయం నందు ఏర్పాటు చేసిన సైక్లోన్ కంట్రోల్ రూమ్ ను సందర్శించి వారు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలు తెలుసుకొని వారికి పలు సూచనలు ఇవ్వడమైనది ఈ కార్యక్రమంలో కట్ట వీర సూరి, చిన్న బుజ్జి, సచివాలయం సిబ్బంది గ్రామ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేయించిన వంటిపల్లి కృష్ణమూర్తి



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 28:**కొనసీమను వణికిస్తున్న మొంథా తుఫాన్ కారణంగా మండల కేంద్రమైన ఆలమూరులో యూనియన్ బ్యాంకు సమీపంలో ఆర్ అండ్ బి రహదారులపై గుంతలు ఏర్పడి నీరు నిలిచిపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణ సమయంలో గుంతలు గుర్తించ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాధాలకు గురవుతున్నారు. విషయాన్ని గమనించిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు తండ్రి అయిన వంటిపల్లి కృష్ణమూర్తి తన సామాజిక బాధ్యతను గుర్తుచేసుకుని మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు.మంగళవారం రాత్రి సమయంలో గాలి వానను సైతం లెక్కచేయకుండా ఆయన సొంత నిధులతో భారీ ప్రొక్లైన్ ఏర్పాటుచేసి ఆర్ అండ్ బి రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.వ్యక్తిగత ప్రమాదాన్ని పట్టించుకోకుండా వాహనదారులు సురక్షితంగా ప్రయాణించాలనే ముఖ్య ఉద్దేశంతో తన సేవలను అంకితం చేశారు. దీనితో ఆ ప్రాంతంలో వాహన రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. ఈ మేరకు పలువురు ఆయనను అభినందించారు. అయితే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు,సహాయ సహకారాలు అందిస్తున్న కృష్ణమూర్తి కుటుంబం ఇటువంటి సేవల్లో కూడా ముందంజలో ఉండటం అనేకులకు, గ్రామ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

## అప్రమత్తమైన విద్యుత్ శాఖ....

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం మరింత తీవ్ర రూపం దాల్చి పెను తుఫాన్ గా మారనుంది. సోమవారం ఉదయం 9 గంటల నుండి వర్షాలు మొదలయ్యాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైల ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడంతో ఏపీఎస్ డిసిఎల్ ఉన్నతాధికారులు, ఏడిఈ శ్రీధర్ ఆదేశాల మేరకు ఆలమూరు మండలంలో ఎలక్ట్రికల్ ఏఈ ప్రసాద్, లైన్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం, సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. విద్యుత్ తీగలపై ఉన్న కొమ్మలను ఇప్పటికే తొలగించారు. విద్యుత్ స్తంభాలతో పాటు క్రేన్లను కూడా అందుబాటులో ఉంచారు. విపరీతమైన గాలులు వీస్తున్నప్పుడు ఎవ్వరూ బయటకు రావొద్దు. చెట్లు కింద, కరెంటు స్తంభాలు వద్ద ఉండవద్దని, తడి చేతులతో స్విచ్లు వెయ్యవద్దని వారు హెచ్చరించారు. ఏ క్షణంలోనైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో అందించనునట్లు వారు వెల్లడించారు. మీ మీ గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడితే వెంటనే సమీపంలో గల లైన్ మేన్ లకు సమాచారం అందించాలని అన్నారు. కొన్ని సమయాల్లో విద్యుత్కు అంతరాయం ఏర్పడవచ్చునని ముందుగా కొవ్వొత్తులు ఉంచుకోవాలని తెలిపారు.

## బ్యాంకుల ప్రారంభానికి తుఫాను అడ్డంకి

**గుంటూరు, అక్టోబరు 28, పెన్ పవర్:** :భారీ తుఫాన్ ఏపీని భయపెడుతోంది. ప్రచండ వాయుగుండం తీరానికి దగ్గరవుతోంది. 13 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోంది. వాయుగుండం ప్రభావంతో ఏపీవ్యాప్తంగా వర్షాలు ప్రారంభం అయ్యాయి. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు భారీ వర్షాలు దంచి కొడుతున్నాయి. ఏపీ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అన్ని జిల్లాలను అప్రమత్తం చేసింది. అయితే కీలకమైన కొన్ని కార్యక్రమాలను వాయిదా వేసింది ఏపీ ప్రభుత్వం. ముఖ్యంగా అమరావతి రాజధానిలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఒక కార్యక్రమం వాయిదా పడడం కాస్త ఇబ్బందికరమే. ఇప్పటివరకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందనగా తుఫాను ప్రభావంతో కార్యక్రమం నిలిచిపోయింది.అమరావతి రాజధాని లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాలుగు ఎకరాల స్థలంలో ప్రధాన కార్యాలయం నిర్మాణానికి ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వద్ద 12 కోట్ల రూపాయలకు భూమిని కొనుగోలు చేసింది. మరోవైపు ప్రధానమైన 12 బ్యాంకులు తమ ప్రాంతీయ కార్యాలయ భవనాలను ఒకే చోట నిర్మాణం చేపట్టాలని భావించాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమక్షంలో శంకుస్థాపన పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అనుకున్నాయి. ఇది ఒక విధంగా చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వం అమరావతి రాజధానికి పూర్తిగా భరోసా ఇచ్చినట్టు అవుతుంది. బ్యాంకు కార్యాలయాలు అంటే కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తాయి. అందునా రిజర్వ్ బ్యాంకు అమరావతిలో భవన నిర్మాణానికి దిగిందంటే.. ఇక రాజధానిని ఎవరు కదిలించలేరన్న ధీమా వచ్చేది. ఈ బ్యాంకుల ద్వారా అమరావతికి తమ మద్దతు సంపూర? స్థాయిలో ఉందని కేంద్రం సంకేతాలు పంపింది. అయితే తుఫాను పుణ్యమా అని ఈ కార్యక్రమం వాయిదా పడింది.అమరావతిలో రిజర్వు బ్యాంకు తో పాటు 12 ప్రధాన బ్యాంకుల కార్యాలయాల నిర్మాణం పనులను వేడుకగా ప్రారంభించి సరికొత్తగా సంకేతాలు పంపాలని చూసింది కేంద్ర ప్రభుత్వం. ఇది పూర్తిగా కేంద్రం ఆధీనంలో జరుగుతున్న కార్యక్రమం. కానీ అమరావతికి చంద్రబాబు సర్కార్ ఎనలేని ప్రాధాన్యమిస్తున్న ద ృష్ట్యా.. ఇప్పటికీ అమరావతిపై వైసీపీ విషం చిమ్ముతూనే ఉంది. దాని దూకుడుకు కళ్లెం వేయాలంటే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు గా ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థలను ప్రారంభించి.. సరైన సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. గాని దానికి తీవ్ర తుఫాను అడ్డంకిగా నిలిచింది.

## కునుకు లేకుండా చేస్తున్న నకిలీ మద్యం కేసు

**తిరుపతి, అక్టోబరు 28, పెన్ పవర్:** ఎవరైనా తప్పు చేయకపోతే నిశ్చింతగా ఉంటారు. తమ తప్పు లేదనుకుంటే దాని గురించి మాట్లాడరు. అయితే ఒకవేళ తప్పు చేసి దొరికిపోతామన్న వారు మాత్రం సందడి చేస్తుంటారు. ఇప్పుడు అటువంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు మాజీ మంత్రి జోగి రమేష్. నకిలీ మద్యం కుంభకోణంలో అసలు నిందితుడు అద్దేపల్లి జనార్దన్ రావు మాజీ మంత్రి జోగి రమేష్ పేరు ప్రస్తావించిన నాటి నుంచి ఆయన చేస్తున్న హడావిడి అంతా కాదు. జోగి రమేష్ ప్రోత్సాహంతోనే తాము కల్తీ మద్యం తయారు చేసినట్లు అద్దేపల్లి జనార్దన్ రావు స్పష్టం చేశారు. కానీ తనకు ఆయన ఎవరో తెలియదని బుకాయించారు జోగి రమేష్. కానీ అదే జనార్దన్ రావుతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు ఒక్కొక్కటి బయటకు రావడంతో జోగి రమేష్ లో ఆందోళన ప్రారంభం అయింది. అయితే ఇప్పుడు దేవుడి ఎదుట ప్రమాణాలతో బయటపడేందుకు జోగి రమేష్ ప్రయత్నిస్తున్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం లో నకిలీ మద్యం డంప్ వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ నేత ృత్వంలోనే ఎక్సైజ్ శాఖ అక్కడ డంపును పట్టుకుంది. దాంతో తంబళ్లపల్లి టిడిపి ఇన్చార్జ్కు సంబంధం ఉందన్న ఆరోపణలు వచ్చిన గంటల వ్యవధిలోనే హై కమాండ్ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆ మరుసటి రోజు ఇబ్రహీంపట్నంలో సాక్షి మీడియా వేదికగా చేసుకుని నకిలీ మద్యం డంపును బయట ప్రపంచానికి చూపించారు జోగి రమేష్. అయితే అదంతా ఒక వ్యూహం ప్రకారం చేసిందంటూ నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు బయట పెట్టడంతో ట్విస్ట్ మొదలైంది. అప్పటినుంచి జోగి రమేష్ హడావిడి ప్రారంభం అయింది.తనకు సన్నిహితుడు అద్దేపల్లి జనార్దన్ రావు అని జోగి రమేష్ మరిచిపోయారు. తిరిగి ఆయన ఎవరు అంటూ ప్రశ్నించారు. తంబళ్లపల్లె కల్తీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జనార్దన్ రావు డంపు బయటపడే సరికి ఆఫ్రికాలో ఉన్నారు. అయితే తన పేరు బయట పెట్టడాన్ని సహించుకోలేక ఆయన తనకు తాను లొంగిపోయేందుకు వచ్చారు. గన్నవరం ఎయిర్పోర్ట్ లో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే కల్తీ మద్యం తనతో తయారు చేయించి.. ఇప్పుడు వారు పక్కకు తప్పుకొని తనను కేసుల్లో ఇరికించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు జనార్దన్ రావు. ఒక సెల్ఫీ వీడియో కూడా విడుదల చేశారు. వైసీపీ హయాంలో జోగి రమేష్ ప్రోత్సాహంతో ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం చేసిన విషయాన్ని కూడా వెల్లడించారు. ఇప్పుడు కూడా తంబళ్లపల్లెలో మద్యం తయారు చేయించి.. చంద్రబాబుతో పాటు లోకేష్ కు చెడ్డ పేరు తేవాలన్నదే ప్లాన్ అని బయటకు వెల్లడించారు అద్దేపల్లి జనార్దన్ రావు.ఈ కేసులో ఇప్పుడు ప్రధాన నిందితుడిగా మాజీ మంత్రి జోగి రమేష్ మారిపోయే అవకాశం ఉంది. అప్పటి నుంచి తనకు ఆ అద్దేపల్లి జనార్దన్ రావు ఎవరో తెలియదు అంటూ చెప్పుకొస్తున్నారు. కానీ అద్దేపల్లి జనార్దన్ రావు మనవాడే అని స్వయంగా జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలు.. చాలా సందరాల్లో ఆయనతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు వెలుగులోకి వచ్చాయి. అయినా సరే తనకు జనార్దన్ రావు తో సంబంధం లేదని.. దుర్గామాత వద్ద ప్రమాణం చేస్తానని చెప్పి ఈరోజు విజయవాడ వచ్చారు. తనకు సంబంధం లేదని ప్రమాణం చేశారు. తన సవాల్ ను చంద్రబాబు, లోకేష్ స్వీకరించలేదని చెప్పుకొచ్చారు. కానీ ఇప్పటికే నకిలీ మద్యం వ్యవహారంలో జోగి రమేష్ పాత్రను పోలీసులు పూర్తిస్థాయిలో అద్దేపల్లి జనార్దన్ రావు నుంచి సేకరించినట్లు తెలుస్తోంది. తన అరెస్టు తప్పదన్న భయంతోనే జోగి రమేష్ ఇలా ప్రమాణాల పాటు పట్టినట్లు ప్రచారం సాగుతోంది.

### జనగామలో పగటి వేషగాళ్లు

## కోతుల కట్టడికి చింపాంజీలు

**వరంగల్ అక్టోబరు 28, పెన్ పవర్:** కోతుల బెడద నుండి విముక్తి కోసం మున్సిపల్ అధికారులు మెదడుకు పదును పెడుతున్నారు..ఇంతకు మించిన మార్గం లేదని సరికొత్త ఆలోచనలతో కోతులను భయపెట్టి తరిమేందుకు వింత వింత వేషాలు వేయాల్సివస్తుంది..ఈ మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా కోతులను తరిమేసేందుకు సిబ్బందిని నియమించి వారికి చింపాంజీ వేషం వేసి పట్టణమంతా తిప్పుతున్నారు.. చింపాంజీ వేషధారణతో కోతులను తరిమేసి తాత్కాలికఉపశమనం పొందుతున్నారు.. మున్సిపల్ సిబ్బంది పగటి వేషాలు, చింపాంజీ వేషధారణ అక్కడ పట్టణమంతా హాట్ టాపిక్ గా మారింది.. ఇప్పటివరకు మనుషులను భయపెట్టే చింపాంజీలని మాత్రమే చూశాం.. కానీఇక్కడ మాత్రం కోతులను భయపెట్టేందుకు మున్సిపల్ సిబ్బంది పగటివేషాలు వేయాల్సి వచ్చింది.. చింపాంజీ మాస్కుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మాస్కులు ధరించాల్సిన దుస్థితి ఏర్పడింది.. చింపాంజీవేషాలు వేసుకున్న జనగామ మున్సిపల్ సిబ్బంది కోతులను పరుగులు పెట్టిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నానా తంటాలు పడుతున్నారు.జనగామ పట్టణం చుట్టూ గుట్టలు ఎక్కువగా ఉండటంతో కోతుల బెడదవిపరీతంగా పెరిగిపోయింది. వేలాది కోతులు పట్టణ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.. ఇళ్లలోకి చొరబడి రక్కి గాయపరుస్తున్నాయి.. ఒంటరిగా తిరగలేని పరిస్థితి నెలకొంది.. ఈ నేపథ్యంలో ప్రజల నుండి ఫిర్యాదులువెల్లువెత్తాయి.. కోతుల నుండి మా ప్రాణాలు కాపాడండి మొర్రో అని వేడుకుంటున్నారు.. వానరసేనల దాడుల నుండి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు జనగామ మున్సిపల్ శాఖ అధికారులు ఇంతకు మించిన మార్గంకనిపించలేదు.. వినూత్న ప్రయోగం సత్ఫలితాలను ఇస్తుంది.. మున్సిపల్ కమిషనర్ కు వచ్చిన ఆలోచనతో కోతులను భయపెట్టేందుకు చింపాంజీ రూపంలో సిబ్బందికి వేషాలు వేయించారు.. ప్రత్యేకంగా నిధులువెచ్చించి చింపాంజీ మాస్క్ లు తెప్పించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ కార్మికులు ఇలా చింపాంజీ వేషాలు ధరించి కోతులను పరుగులు పెట్టిస్తున్నారు.. ఎక్కువగా కోతులు సంచరించే బతుకమ్మకుంటతో పాటు, అన్నికాలనీలో ఇలా చింపాంజీ వేషాలు ధరించి కోతుల వెంట పడుతున్నారు.చివరకు మున్సిపల్ అధికారుల ప్రయత్నం ఫలించింది.. చింపాంజీ వేషధారణలో సిబ్బంది పరుగులు పెడుతూ.. కోతులను హడలెత్తిపోయేలాచేస్తున్నాయి.. చింపాంజీ వేషధారణలో మున్సిపల్ సిబ్బంది చేస్తున్న హావభావాలు.. చేష్టలు చూసి భయంతో కోతులు తుర్రుమని పారిపోతున్నాయి.. సిబ్బందికి వేషాలు ధరించడం కాస్త ఇబ్బందిగా ఉన్న కోతులనుండి ప్రజలకు విముక్తి లభించడంతో అధికారులు సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు.. ఈ ఐడియా అదుర్స్ అని ప్రజలు అంటుంటే%ౌా%కోతుల సమస్య పరిష్కారానికి మాకు ఇంతకు మించిన మార్గం కనిపించలేదని మున్సిపల్ అధికారులు చెప్తున్నారు.

# రిజర్వ్డ్ నియోజకవర్గాలపై ఫోకస్..

**విజయవాడ, అక్టోబరు 28, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్ లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే.. రిజర్వ్ డ్ నియోజకవర్గాలపై అగ్రవరా?ల ఆధిపత్యం కొనసాగుతుంది. అది వైసీపీ కావచ్చు. టీడీపీ కావచ్చు. మరేదైనా పార్టీ కావచ్చు. గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నదిదే. రాజ్యాంగం ప్రకారం రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో వారిని మాత్రమే అభ్యర్థిగా ఎంపిక చేయాల్సి ఉన్నందున వారిని తప్పనిసరి పరిస్థితుల్లో ఎంపిక చేస్తున్నారు. గెలిచిన తర్వాత అధికారంలో ఉన్న పార్టీకి చెందిన అగ్రకులానికి చెందిన నేతల ఆధిపత్యం ఆ నియోజకవర్గాల్లో ఉండటం, ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు నామమాత్రంగా మిగిలిపోవడం కొన్ని దశాబ్దాల నుంచి జరుగుతున్న తంతు ఇదే. దీనికి ఏ ఒక్క రాజకీయ పార్టీ మినహాయింపు కాదు. ఎన్నికల ప్రచారంలో మాత్రం ఎస్సీ, ఎస్టీ ఓట్ల కోసం వారి వెంట పరుగులు తీస్తారు. గెలిచిన తర్వాత మాత్రం అక్కడ వారిని నామమాత్రంగానే మిగిలేలా చేస్తారు నాడు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కర్నూలు జిల్లాలోని నందికొట్కూరులో

బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కోడుమూరులో కోట్ల విష?వర్ధన్ రెడ్డి, పాడేరు, రంపచోడవరంలో అనంతబాబు కావచ్చు.. ఇలా అనేక చోట్ల నాడు ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఇబ్బందులు పడ్డారు. తమ గోడును అధినాయకత్వానికి చెప్పుకున్నా కూడా ఫలితం కనిపించ లేదు. జగన్ జోక్యం చేసుకున్నప్పటికీ, అక్కడ వారిదే ఆధిపత్యం కావడంతో ఎమ్మెల్యేలనే సర్దుకు పోవాలని బుజ్జగించి పంపారని చెబుతారు. నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టులు, ఇతర విషయాల్లో అక్కడి అగ్రకులాలకు చెందిన నేతలు చెప్పిన మాటే చెల్లుబాటు అవుతుంది. అధికారులు కూడా వారి మాటలనే శిరోధార్యంగా భావిస్తారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలను లెక్క చేయరు. ఇక టీడీపీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. కొవ్వూరు నియోజకవర్గంలో జవహర్ కు టీడీపీకి చెందిన అక్కడ అగ్రకులానికి చెందిన నేతలు ఆధిపత్యం వహించారు. చివరకు ఆయనకు టిక్కెట్ దక్కకుండా చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో నాటి మంత్రి, ఎమ్మెల్యేగా ఎన్నికైన ఐఆర్ఎస్ అధికారి రావెల కిశోర్ బాబుపై అక్కడ కమ్మ సామాజికవర్గం నేతలు పట్టుబట్టి బయటకు పంపారు. ఎవరో ఒకరో ఇద్దరో తప్పించి ఎవరూ ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు వారిని కాదని ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. తాజాగా తిరువూరు నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై కూడా ఇదే కోవకు చెందినవిగా భావిస్తున్నారు. కొలికపూడి శ్రీనివాసరావుపై ఎంపీ కేశినేని చిన్ని ఆధిపత్యం చూస్తుంటే స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు కావస్తున్నా దీనికి మాత్రం తెరపడే అవకాశం కనిపించడం లేదన్న ఆవేదన అందరిలోనూ వ్యక్తమవుతుంది.

# అమరావతి కేంద్రంగా మరో జిల్లా

**విజయవాడ, అక్టోబరు 28, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్లో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో పాటు పేర్ల మార్పుపై ప్రభుత్వం చేపట్టిన కసరత్తు చివరి దశకు వచ్చింది. ఈ అంశాలపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబుతో సమావేశం కానుంది. ఈ కీలక భేటీలో జిల్లాల సరిహద్దులు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు, పేర్ల మార్పుపై రాష్ట్రవ్యాప్తంగా అందిన అర్జీలు, వినతులపై చర్చిస్తారు. సీఎం చంద్రబాబు సూచనలు తీసుకుని మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదికను రూపొందించనుంది. కొత్త జిల్లాలు, మండలాలు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించిన ఈ నివేదికను నవంబరు 7వ తేదీన జరిగే ఏపీ కేబినెట్ భేటీలో చర్చించి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఆ తరువాత ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, చివరగా గెజిట్ను విడుదల చేస్తారు. జనగణన ప్రక్రియ ఉన్న కారణంగ ఈ మొత్తం ప్రక్రియను డిసెంబరు 31వ తేదీ లోగానే పూర్తిచేయాలని కూటమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పుపై ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఆగస్టు 13న తొలి సమావేశం నిర్వహించి, అనంతరం జిల్లాల వారీగా ప్రజలు, వివిధ వర్గాలు, ప్రజాసంఘాల నుంచి వినతులు స్వీకరించింది. ఇటీవల జరిగిన భేటీలో అందిన అన్ని అర్జీలపై చర్చించి, జిల్లాల అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో కొత్త జిల్లా ఏర్పాటుకు సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ మేరకు రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు 4 విలీన మండలాలతో జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రమైన పాడేరుకు 187 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే, అమరావతి కేంద్రంగా పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదన ఉంది. సచివాలయం, అసెంబ్లీ, కొత్త భవనాల నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణ, ప్రొటోకాల్ విధుల పెరుగుదలను ద ృష్టిలో ఉంచుకుని అమరావతిని కొత్త జిల్లా ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. వీటితో పాటు మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాల నివేదికను కూడా సమర్పించనున్నారు.మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా మార్కాపురం కేంద్రంగా కనిగిరి, గిద్దలూరు, దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటుకు ఉపసంఘం సిఫార్సు చేసింది. అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే అంశంపై స్థానిక ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలనే ప్రతిపాదన ఉంది. రామాయపట్నం పోర్టు ఏర్పాటు చేస్తున్నారు



కనుక కందుకూరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగించాలా? లేక ప్రకాశం జిల్లాలో చేర్చాలా? అనే అంశంపై రేపు సమావేశంలో డిసైడ్ చేయనున్నారు.
అద్దంకి, మడకశిర సహా సుమారు 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పరిపాలనా సౌలభ్యం మేరకు, ఒక నియోజకవర్గం రెండు, 3 రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉంటే ఒకే నియోజకవర్గ పరిధిలోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదోని మండలంలో జనాభా ఎక్కువగా ఉన్నందున, ఈ మండలాన్ని విభజించాలని ప్రజల వినతులపైనా నిర?యం తీసుకోవాల్సి ఉంది. మండపేట, కొత్తపేట, ఎస్.కోట సహా కొన్ని నియోజకవర్గాలను మరో జిల్లాకు మార్చాలనే ప్రతిపాదనలు ఉపసంఘం సీఎం ద ృష్టికి తీసుకెళ్లనుంది.

### న్యూఇయర్ కు ముందే ప్రకటన

న్యూఇయర్కు కొత్తగా ఆరు జిల్లాలు. తెలంగాణ నుంచి ఏపీ విడిపోయిన తర్వాత 13 జిల్లాలు ఉండేవి. దాన్ని జగన్ సర్కార్ 26 జిల్లాలుగా మార్చింది. జిల్లా కేంద్రాలు, సరిహద్దులు, జిల్లాల పేర్లపై వివాదం రగడ నలుగుతూనే ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి వివిధ జిల్లాల నుంచి ఎక్కువగా వినతులు వచ్చాయి. వాటిలో కొత్త జిల్లాల ఏర్పాటు వ్యవహారం ఉంది. దీనిపై చంద్రబాబు ప్రభుత్వం ద ృష్టి సారించిందని తెలుస్తోంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. వచ్చే ఏడాది నుంచి కేంద్రప్రభుత్వం జనగణన చేపట్టనుంది. ఈ నేపథ్యంలో 2026 జనవరి ఒకటి నుంచి 2027 మార్చి చివరకు వరకు జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్ల మార్పుకు ఎలాంటి అవకాశం ఉండదు. ఈ పని చేసినా ఈ ఏడాది డిసెంబర్ 31లోగా చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎన్నికల హడావుడి నెలకొననుంది, ఆ తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటు చేయడం దాదాపు అసాధ్యం. ఉత్తరాంధ్ర-సీమలో ఒకొక్కటి. ఈలోగా ఆ పని చేయాలన్నది కూటమి ప్రభుత్వం ఆలోచన. దీని ఆధారంగా చకచకా అడుగులు వేస్తోంది. తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్.. జనాభా, భౌగోళికంగా పెద్దది. ప్రస్తుతం 26 జిల్లాలు ఉన్నాయి. వీటిని 32 జిల్లాలుగా చేయాలని ప్లాన్ చేస్తోంది కూటమి సర్కార్. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త జిల్లాలపై సాధ్యాసాధ్యాలపై ద ృష్టి సారించింది. ఇప్పటికే వివిధ జిల్లాల ప్రజల నుంచి వినతులు స్వీకరించింది కేబినెట్ సబ్ కమిటీ. కొన్ని జిల్లాలు విస్తీర? పరంగా పెద్దదిగా ఉన్నాయి. జిల్లా కేంద్రాలకు రాకపోకలకు సుదూరంగా ఉండడం దీనికి కారణమైంది. వాటిపై ఇప్పుడు చంద్రబాబు సర్కార్ ఫోకస్ చేసింది. న్యూఇయర్ లోపు కొత్తగా ఆరు జిల్లాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఉమ్మడి శ్రీకాకుళం నుంచి పలాస, ప్రకాశం నుంచి మార్కాపురం, చిత్తూరు జిల్లా మదనపల్లె, నెల్లూరు నుంచి గూడూరు, కడప నుంచి రాజంపేట, గుంటూరు నుంచి అమరావతి కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది. దీనిపై కొన్నాళ్లు ప్రచారం సాగుతోంది కూడా. ఈ రెండు నెలల్లో మంత్రివర్గం ఉప సంఘం ఇచ్చే నివేదికను కేబినెట్లో పెట్టి చర్చించనుంది. ఈ రెండు నెలల్లో కొత్త జిల్లాల వ్యవహారానికి ఫుల్స్టాప్ పెట్టాలని భావిస్తోంది. లేకుంటే మరో 15 నెలలు ఆగాల్సి వుంటుంది. ఈలోగా ఎన్నికలకు సమయం ముంచుకొస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ మూడో వారానికి వాటిని పూర్తి చేయాలని ఆలోచన చేస్తోంది. వచ్చే ఏడాది జనవరి 26 నుంచి కొత్త జిల్లాలను అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు ప్రభుత్వం వర్గాలు చెబుతున్నారు

# కడపలో ఐటీ క్లస్టర్ పార్క్..




**కడప, అక్టోబరు 28, పెన్ పవర్:** ఏపీని పారిశ్రామికంగా అభివ ృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అన్ని ప్రాంతాల అభివ ృద్ధే ధ్యేయంగా ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే కడపలో ఐటీ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ విషయాన్ని కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి వెల్లడించారు. కడపలో ఐటీ క్లస్టర్ పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని.. ఇప్పటికే భూమిని కూడా గుర్తించినట్లు మాధవిరెడ్డి తెలిపారు. గుర్తించిన భూమిలో మౌలిక సదుపాయాల అభివ ృద్ధిపై స్థానిక కలెక్టర్ను ఆదేశించినట్లు వివరించారు.రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటుగా పరిపాలనా పరమైన అనుమతులు కూడా వేగంగా మంజూరయ్యేలా చూస్తోంది. ఈ క్రమంలోనే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకువస్తున్నాయి. దీంతో ఆర్థిక రాజధాని విశాఖపట్నం ఐటీ, ఏఐ హబ్గా రూపుదిద్దుకుంటోంది. అయితే ఇదే సమయంలో రాయలసీమ జిల్లాల్లో అభివ ృద్ధిపైనా ప్రభుత్వం ద ృష్టి సారించింది. ఈ క్రమంలోనే వైఎస్సార్ కడప జిల్లాల ఐటీ క్లస్టర్ పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు రచిస్తోంది. కడపలో ఈ ఐటీ క్లస్టర్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రెడ్డెప్పగారి మాధవిరెడ్డి వెల్లడించారు. ప్రతిపాదిత ఐటీ క్లస్టర్ పార్కు ఏర్పాటుకు కావాల్సిన భూమిని జిల్లా యంత్రాంగం ఇప్పటికే గుర్తించిందని వివరించారు.టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివ ృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని మాధవి రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా విశాఖపట్నాన్ని ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్గా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో ఉన్నట్లు వివరించారు. అలాగే తిరుపతి. శ్రీసిటీ, కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్లను ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాలుగా అభివ ృద్ధి చేయనున్నట్లు వివరించారు. కర్నూలు, అనంతపురం సహా మిగతా రాయలసీమ జిల్లాల్లో డిఫెన్స్ , సోలార్ ఎనర్జీ, డ్రోన్ టెక్నాలజీకు సంబంధించిన కంపెనీలు పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లి నియోజకవర్గంలోనూ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు. అలాగే రాష్ట్రంలో ఎంపిక చేసిన నియోజకవర్గాలలో ఐటీ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ క్రమంలోనే కడపలో ఐటీ పార్క్ ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం ప్రాథమికంగా అనుమతులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే మాధవి రెడ్డి వెల్లడించారు. ఐటీ కంపెనీలు, స్టార్టప్లు, ఎంటర్ప్రెన్యూయర్లను ఆకర్షించి, ఈ ప్రాంతంలో ఐటీ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు వివరించారు.ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ (ఐటీఈ అండ్ సీ) విభాగం ఇప్పటికే కడప జిల్లా కలెక్టర్ను ఆదేశించినట్లు తెలిపారు. కడపలో ఐటీ పార్కు ఏర్పాటు కోసం గుర్తించిన 10 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించాలని, ప్రతిపాదిత ఐటీ పార్క్లో మౌలిక సదుపాయాల అభివ ృద్ధికి నిధులు కేటాయించాలని ఆదేశించినట్లు కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవిరెడ్డి వెల్లడించారు.

# అగార్కర్ ఇప్పుడేమంటావ్: రెండు మ్యాచ్‌ల్లో 15 వికెట్లు.. రీ ఎంట్రీ ఫిక్స్ చేసుకోండి!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ మూడు ఫార్మాట్ లలో జాతీయ జట్టులో స్థానం దక్కిచుకోలేకపోతున్నాడు. ఓ వైపు సెలక్టర్లు షమీ ఫిట్ నెస్, ఫామ్ పై తమకు అనుమానాలు ఉన్నాయని వ్యక్తం చేయగా.. మరోవైపు ఈ సీనియర్ పేసర్ తాను పూర్తి ఫిట్ నెస్ తో ఉన్నా సెలక్టర్లు ఎంపిక చేయట్లేదని నిరాశ వ్యక్తం చేశాడు. దీంతో షమీకి ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ ఛాలెంజింగ్ గా మారింది. ఈ ఏడాది రంజీల్లో బెంగ్లా తరపున బరిలోకి దిగిన షమీ దుమ్ములేపుతున్నాడు. 35 ఏళ్ళ వయసులో తన బౌలింగ్ తో నిప్పులు చెరిగాడు. ఇప్పటి వరకు రెండు మ్యాచ్ లాడిన షమీ ఏకంగా 15 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. తొలి మ్యాచ్ లో ఉత్తరాఖండ్‌పై బెంగాల్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో షమీ తొలి ఇన్నింగ్స్ లో మూడు.. రెండు ఇన్నింగ్స్ లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. బెంగాల్ గెలుపులో కీలక పాత్ర పోషించిన షమీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. మంగళవారం (అక్టోబర్ 28) కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో గుజరాత్ పై జరిగిన మ్యాచ్ లో మరింత రెచ్చిపోయాడు. 35 ఏళ్ల ఈ పేసర్ తొలి ఇన్నింగ్స్‌లో 44 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా.. రెండో ఇన్నింగ్స్ లో 38 పరుగులిచ్చి 5 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

ఓవరాల్ గా రెండు మ్యాచ్ ల్లో 15 వికెట్లు పడగొట్టి సెలక్టర్లకు సవాలు విసిరాడు. షమీ బౌలింగ్ తో గుజరాత్‌ను బెంగాల్ 141 పరుగుల తేడాతో ఓడించింది. సౌతాఫ్రికాతో నవంబర్ 14 నుంచి రెండు మ్యాచ్ ల టెస్ట్ జరగనుంది. ఈ సిరీస్ కు షమీ ఎంపికవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకవేళ షమీని సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ కు ఎంపిక చేయకపోతే అతడి కెరీర్ ముగిసినట్టుగానే చెప్పుకోవాలి. మరి సెలక్టర్లు షమీ ప్రదర్శనను పరిగణలోకి తీసుకుంటారో లేదో చూడాలి.

షమీని ఇప్పటికే టీ20 ఫార్మాట్ నుంచి పూర్తిగా పక్కన పెట్టిన సెలక్టర్లు ఇకపై వన్డేల్లోనూ చెక్ పెట్టబోతున్నట్టు పరోక్షంగా హింట్ ఇచ్చేశారు. మూడు ఫార్మాట్ లలో చోటు దక్కించుకోలేకపోతున్న ఈ స్టార్ పేసర్ తన అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాడు. తనని ఎందుకు జట్టులో తీసుకోవట్లేదో పరోక్షంగా సెలక్టర్లకు ప్రశ్నించాడు. తాను ఫిట్ గా ఉన్నానని చెబుతూ భారత జట్టు యాజమాన్యంపై విమర్శలు గుప్పించాడు. వాస్తవానికి ఐపీఎల్ లో ఘోరంగా విఫలం కావడం షమీ కెరీర్ పై ప్రతికూల ప్రభావం చూపించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున 9 మ్యాచ్‌ల్లో 6 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. అప్పటికే ఫిట్‌నెస్, ఫామ్ తో ఇబ్బందిపడిన షమీకి ఇంగ్లాండ్ తో 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ కు చోటు దక్కలేదు. ఆ తర్వాత ఆస్ట్రేలియా ఏ సిరీస్ లోనూ ఇండియా ఏ జట్టులో స్థానం దక్కలేదు. ఆ తర్వాత ముగిసిన దులీప్ ట్రోఫీలోనూ కేవలం ఒక వికెట్ మాత్రమే తీసుకొని నిరాశపరిచాడు. ఓవరాల్ గా షమీ అంతర్జాతీయ కెరీర్ ముగిసినట్టుగానే కనిపిస్తుంది.

# సెమీస్ సమరం.. షెడ్యూల్, టైమింగ్, లైవ్ స్ట్రీమింగ్ వివరాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ లో నాకౌట్ కు రంగం సిద్ధమైంది. బుధవారం (అక్టోబర్ 29) నుంచి సెమీ ఫైనల్స్ ప్రారంభం కానున్నాయి. అంచనాలకు తగ్గట్టుగా ఆడి ఇండియా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు సెమీస్ కు అర్హత సాధించాయి. ఆస్ట్రేలియా (13) ఆడిన అన్ని మ్యాచ్ ల్లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచింది. ఇంగ్లాండ్ (11), సౌతాఫ్రికా (10), ఇండియా (7) వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. షెడ్యూల్ ప్రకారం పాయింట్ల పట్టికలో తొలి స్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానంలో ఉన్న జట్టుతో సెమీస్ ఆడాల్సి ఉంది.. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్టు మరో సెమీ ఫైనల్లో తలపడతాయి. తొలి సెమీ ఫైనల్లో ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ బుధవారం (అక్టోబర్ 29) జరుగుతుంది. రేపు గౌహతి వేదికగా బార్సపార క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్ లో ఇంగ్లాండ్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. ఈ టోర్నీలో ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో ఇంగ్లాండ్ చేతిలో సౌతాఫ్రికా ఘోరంగా ఓడిపోయింది. మరో సెమీస్ లో ఇండియాతో ఆస్ట్రేలియా తలపడుతుంది. ఈ మ్యాచ్ గురువారం (అక్టోబర్ 30) జరుగుతుంది. ఈ మ్యాచ్ లో ఆస్ట్రేలియా ఫేవరేట్ గా బరిలోకి దిగుతోంది. గ్రూప్ దశలో జరిగిన మ్యాచ్ లో ఇండియాపై ఆస్ట్రేలియా ఉత్కంఠ విజయం సాధించింది. ఆదివారం (నవంబర్ 2) ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

**సెమీ ఫైనల్, ఫైనల్ షెడ్యూల్:**

**తొలి సెమీ ఫైనల్: సౌతాఫ్రికా VS ఇంగ్లాండ్**

అక్టోబర్ 29- బుధవారం- గౌహతి, బార్సపార క్రికెట్ స్టేడియం (మధ్యాహ్నం 3:00 గంటలకు)

రెండో సెమీ ఫైనల్: ఆస్ట్రేలియా vs ఇండియా

అక్టోబర్ 30- గురువారం- నవీ ముంబై, డివై పాటిల్ స్టేడియం (మధ్యాహ్నం 3:00 గంటలకు)

**ఫైనల్ మ్యాచ్:** నవీ ముంబై, డివై పాటిల్ స్టేడియం- నవంబర్ 2 (మధ్యాహ్నం 3:00 గంటలకు)

**టైమింగ్, లైవ్ స్ట్రీమింగ్, టెలికాస్టింగ్ వివరాలు:**

**లైవ్ టెలికాస్ట్:** స్టార్ స్పోర్ట్స్ నెట్ వర్క్ మూడు వన్డేలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది

**లైవ్ స్ట్రీమింగ్:** జియో సినిమా యాప్, వెబ్‌సైట్ లో ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది.

# ఫ్యాన్స్‌కి కిక్ ఇచ్చే న్యూస్.. కోహ్లీ రిటైర్మెంట్‌పై నోరు విప్పిన డివిలియర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడతాడో లేదో అనే విషయంలో క్లారిటీ లేదు. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ లోనూ కోహ్లీ తొలి రెండు వన్డేల్లో డకౌటై తీవ్రంగా నిరాశపరిచాడు. అయితే మూడో వన్డేలో హాఫ్ సెంచరీ చేసి టచ్ లోకి వచ్చాడు. వరల్డ్ కప్ కు మరో రెండున్నరేళ్ల సమయం ఉంది. ప్రస్తుతం కోహ్లీ వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడడంతో అతడి ఫామ్ పై ఆందోళన ఉంది. ఈ సమయంలో కోహ్లీ ఫ్యాన్స్ కు గుడ్ న్యూస్ చెబుతూ డివిలియర్స్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే వరల్డ్ కప్ కోహ్లీ ఆడతాడని కన్ఫర్మ్ చేశాడు. కోహ్లీకి డివిలియర్స్ కు మధ్య ఎలాంటి అనుబంధం ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు కోహ్లీతో టచ్ లో ఉండే డివిలియర్స్ కు ఈ స్టార్ బ్యాటర్ గురించిన మొత్తం విషయాలు తెలుస్తాయి. తాజాగా కోహ్లీపై డివిలియర్స్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కోహ్లీ కెరీర్ గురించి డివిలియర్స్ ఒక పోడ్ కాస్ట్ లో మాట్లాడుతూ ఇలా అన్నాడు..”నా అభిప్రాయం ప్రకారం 2027 ప్రపంచ కప్ కోహ్లీ కెరీర్ లో చివరిది అవుతుంది. ఐపీఎల్ విషయానికి వస్తే ఈ కథ భిన్నంగా ఉంటుంది. కోహ్లీ మూడు నుంచి ఐదు సంవత్సరాలు ఐపీఎల్ ఆడొచ్చు. ఐపీఎల్ మూడు నెలల్లో సిద్ధం కావొచ్చు. కానీ వరల్డ్ కప్ నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరిగే వరల్డ్ కప్ కు సిద్ధం కావడం కష్టమైన పని”. అని డివిలియర్స్ అన్నాడు.

వన్డే ప్రపంచ కప్ 2027 లో జరుగుతుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఈ టోర్నీకి ఆతిథ్యమిస్తున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించడంతో వన్డే ఫార్మాట్ కు కూడా గుడ్ బై చెబుతాడనే ఊహాగానాలు వచ్చాయి. అయితే వాటిలో నిజం లేదని కోహ్లీ స్పష్టం చేశాడు. 2023 వన్డే వరల్డ్ కప్ లో సొంతగడ్డపై ఇండియా.. ఆస్ట్రేలియాపై ఓడిపోయింది. ఈ టోర్నీ మొత్తం అద్భుతంగా రాణించిన విరాట్.. 761 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు. వరల్డ్ కప్ ఫైనల్ ఓటమి కోహ్లీతో పాటు టీమిండియాను తీవ్రంగా కలిచి వేసింది.

# సర్జరీ గురించి శ్రుతి హాసన్ నిజం చెప్తే..

సినిమాల్లోకి వచ్చే హీరో హీరోయిన్లు మరింత ఆకర్షణీయంగా కనిపించేందుకు చిన్న చిన్న సర్జరీలు చేసుకోవడం ఎప్పట్నుంచో ఉన్నదే. కొందరు ఈ విషయంలో ఓపెన్‌గా నిజాలు చెబుతారు. కొందరు దాపరికం పాటిస్తారు. కానీ కెరీర్ ఆరంభమైనపుడు.. తర్వాత లుక్స్ చూస్తే మార్పు స్పష్టంగా తెలిసిపోతుంది. బాలీవుడ్ హీరోయిన్లలో ముఖం మీద కత్తి గాటు పడని తక్కువమందే అని చెప్పాలి. ఇలాంటి సర్జరీలు చేయించుకుని అందాన్ని దెబ్బ తీసుకున్న వాళ్లు కూడా ఉన్నారు.

సౌత్ నుంచి వెళ్లి బాలీవుడ్‌లో కూడా సినిమాలు చేసిన శ్రుతి హాసన్ సైతం కెరీర్ ఆరంభంలోనే కాస్మొటిక్ సర్జరీ చేయించుకుంది. కెరీర్ మొదట్లో చేసిన లక్, అనగనగా ఒక ధీరుడు చిత్రాలతో పోలిస్తే తన లుక్‌లో మార్పు స్పష్టంగా గమనించవచ్చు. ఐతే తాను కాస్మొటిక్ సర్జరీ చేయించుకున్న విషయాన్ని శ్రుతి ఏమీ దాచిపెట్టలేదు. కానీ నిజం బయటపెట్టినందుకు తాను తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చిందని, జనం దారుణమైన మాటలు అన్నారని ఒక ఇంటర్వ్యూలో శ్రుతి వాపోయింది.

“నేను కాస్మొటిక్ సర్జరీ చేయించుకున్న విషక్న్ని దాచిపెట్టలేదు. దాని గురించి ఓపెన్‌గానే చాలాసార్లు మాట్లాడాను. కానీ దీని మీద చాలామంది నెగెటివ్ కామెంట్లు చేశారు. ఈమె ప్లాస్టిక్ సర్జరీల దుకాణం.. అంటూ విమర్శలు చేశారు. నిజాయితీగా ఉన్నందుకు నేను చెల్లించిన మూల్యం అది. కానీ ఏం చేశానో.. ఎలా చేశానో నాకు మాత్రమే తెలుసు.

మనం మన పనిలో అయినా.. వ్యక్తిగత జీవితంలో అయినా.. ప్రేమలో ఉన్నపుడైనా నిజం మాట్లాడితే వేలెత్తి చూపేవాళ్లే ఎక్కువగా ఉ:టారు. అయినా ఎవరు ఏమనుకుంటారో అని పట్టించుకోకుండా నేను నాలా ఉండడానికే ప్రయత్నిస్తా” అని శ్రుతి చెప్పింది. తాను సౌత్ సినిమాలతో పాటు బాలీవుడ్‌లోనూ నటించానని.. కానీ సౌత్‌లో స్టార్లు చాలా వినయంగా, గౌరవభావంతో ఉంటారని.. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తారని.. వాళ్ల లైఫ్ స్టైల్ కూడా సింపుల్‌గా ఉంటుందని శ్రుతి అభిప్రాయపడింది.



# బాబి మద్యం మానేయకపోతే..!







అలవాట్లు సరిగా లేకపోతే, క్రమశిక్షణ అనేదే లేకపోతే పరిశ్రమ అస్సలు సహించదు. అలాంటి వారిని దరిదాపుల్లోకి కూడా రానివ్వరు. అది పరిశ్రమ వ్యక్తుల స్వభావం. ఈ విషయాన్ని గ్రహించలేక చతికిలబడ్డాడు బాబి అలియాస్ బాబి డియోల్. ధర్మేంద్ర వారసుడిగా అతడు పెద్ద స్థాయికి ఎదగాల్సినవాడు. కానీ అలవాట్ల కారణంగా, క్రమశిక్షణా రాహిత్యం కారణంగా, విజయాలు అందుకోలేక అతడు రేసులో వెనకబడ్డాడు. దశాబ్దం పైగా అతడు పూర్తిగా ఇంటికే పరిమితమయ్యాడు. అదే సమయంలో మత్తుకు బానిసయ్యాడు. ఆల్కహాలిక్ గా మారాడు. ఇంట్లో భార్య ఇచ్చే డబ్బులతో జీవించానని తెలిపాడు. ఇటీవల అతడు తన తప్పులన్నిటినీ ఒప్పుకుంటున్నాడు. ఇప్పుడు కూడా తాను ఆల్కహాల్ మానేశాక సంబంధాలు మెరుగయ్యాయని అంగీకరించాడు. తన అలవాట్లలో వచ్చిన మార్పు ఈ మేలు చేసిందని అన్నాడు. ఇటీవల మద్యం మానేయడం జీవితాన్ని మార్చేసిందని అన్నాడు. కొందరికి బానిసయ్యే స్వభావం జన్యువుల్లోనే ఉంటుందని కూడా బాబి అన్నాడు. నేను తాగుడు మానేసాక మంచి వాడిని అయ్యాను. ప్రతి ఒక్కరితో నాకు సంబంధాలు మెరుగయ్యాయి అని తెలిపాడు.

అలాగే బాబికి యానిమల్ పునర్జన్మనివ్వగా, ఇటీవలే ఆర్యన్ ఖాన్ తెరకెక్కించిన %-%ది బాలిలిలిడ్స్ ఆఫ్ బాలీవుడ్%-% నటుడిగా మంచి పేరు తెచ్చింది. ఈ సిరీస్ మేకింగ్ విషయంలో ఆర్యన్ ఖాన్ పనితనంపై బాబి ప్రశంసలు కురిపించాడు. అతడి తండ్రి సూపర్ స్టార్ అయినా కానీ, ఆ నీడ పడకుండా తనను తాను ప్రత్యేకంగా ఆవిష్కరించుకోవడానికి సాహసం చేసాడని ఆర్యన్ ని ప్రశంసించాడు. ఆర్యన్ ధైర్యానికి హ్యాట్సాఫ్ చెప్పాడు. బాబి తదుపరి కొన్ని వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. సందీప్ వంగా %-%యానిమల్ పార్క్%-% చిత్రంలోను నటించాల్సి ఉంది. ఇటీవల తెలుగు, తమిళ చిత్రాలకు బాబి అధిక ప్రాధాన్యతను ఇస్తున్న సంగతి తెలిసిందే.


Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com